**చిన్నారుల ప్రాణదాత డాక్టర్ వెంకటేశ్వర్లు చిరస్మరణీయులు**




# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

**టైలరింగ్ కేంద్రాన్ని పరిశీలించిన అడిషనల్ కలెక్టర్, ఎంపీడీవో**




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 220 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- బుధవారం 05 ఆగస్టు 2026


## తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



**'అమరజీవి జలధార' గోదావరి జిల్లాల తాగునీటి సమస్యకు పరిష్కారం: పవన్ కల్యాణ్**

**జల్ జీవన్ మిషన్ కింద అమలవుతున్న 'అమరజీవి జలధార' ప్రాజెక్టు**

**తీరప్రాంతాల్లోని 33 లక్షల మందికి సురక్షిత మంచినీటిని అందించడమే లక్ష్యం**

**నిర్దేశిత వ్యవధిలోనే నిర్మాణాలను పూర్తి చేయాలన్న పవన్**

**అమరావతి,ఆగస్టు 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** జల్ జీవన్ మిషన్ కింద చేపడుతున్న 'అమరజీవి జలధార' ప్రాజెక్టు ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతుందని ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. మంగళగిరిలోని తన క్యాంప్ కార్యాలయంలో ఈ ప్రాజెక్టు **మిగతా 2లో...**

# పారదర్శకంగా పోలీస్ ఉద్యోగ నియామకాలు

## - పరీక్షల నిర్వహణపై ప్రత్యేక నిఘా

## - అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

**హైదరాబాద్,ఆగస్టు 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** పోలీస్ ఉద్యోగ నియామకాల భర్తీ ప్రక్రియలో ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. 7,437 పోస్టుల భర్తీ ప్రక్రియకు ఎలాగైనా భంగం కలిగించాలని కొన్ని రాజకీయ పార్టీలతో పాటు ఇతర శక్తులు ప్రయత్నిస్తున్నట్లు నిఘా వర్గాలు సీఎం దృష్టికి తీసుకెళ్లాయి. ఈ నేపథ్యంలో డీజీపీ సీవీ ఆనంద్ తో పాటు ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. నియమ, నిబంధనలనుసరించి ఎలాంటి లోపాలకు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. ప్రశ్నపత్రాల తయారీ, ముద్రణ, రవాణాతో పాటు అన్ని ప్రక్రియల్లో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని డీజీపీని ఆదేశించారు. కోచింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షల నిర్వహణపై సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల్లో ఎలాంటి దుష్ప్రచారం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగం ఇప్పిస్తామని మోసం చేసే దళారులు, నకిలీ వెబ్ సైట్లు, సోషల్ మీడియా అకౌంట్లపై సైబర్ క్రైమ్ విభాగంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షల నిర్వహణ పూర్తయ్యే వరకు సైబర్ సెక్యూరిటీ, ఇంటలీజెన్స్ విభాగం పూర్తి **మిగతా 2లో...**



## ట్రంప్ తాజా సుంకాలు చట్టవిరుద్ధం

**కోర్టులో వ్యాజ్యం వేసిన అమెరికా రాష్ట్రాలు**



**వాషింగ్టన్,ఆగస్టు 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** భారత్ సహా 60 వాణిజ్య భాగస్వామ్య దేశాల నుంచి దిగుమతి అవుతున్న వస్తువులపై 10 నుంచి 12.5 శాతం వరకూ కొత్తగా సుంకాలు విధించాలని డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై అమెరికాలోని ఇరవై ఐదు రాష్ట్రాలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. ఈ సుంకాలు అక్రమమైనవని, ఫిబ్రవరిలో సుప్రీంకోర్టు కొట్టివేసిన దిగుమతి పన్నుల స్థానంలో ట్రంప్ ప్రభుత్వం వీటిని తీసుకొచ్చే ప్రయత్నం చేసిందని ఆరోపించాయి. సుంకాల విధింపును కొట్టివేయాలని, వాటిని చట్టవిరుద్ధమైనవిగా ప్రకటించి ఇప్పటికే వసూలు చేసిన సొమ్మును తిరిగి వాపసు చేసేలా చూడాలని యూఎస్ కోర్ట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ట్రేడ్‌లో దాఖలు చేసిన వ్యాజ్యంలో ఆ రాష్ట్రాలు అభ్యర్థించాయి. 59 రాష్ట్రాలు, యూరోపియన్ యూనియన్‌పై గత నెలలో విధించిన సుంకాలు అమెరికా దిగుమతు లలో 99.4 శాతం వాటాను కలిగి ఉన్నాయని రాష్ట్రాలు వాదించాయి. కార్మికులతో బలవంతంగా పనులు చేయించి తయారు చేసిన వస్తువుల దిగుమతులను ఆపాలని కోరినప్పటికీ ఆయా దేశాలు పట్టించుకోలేదని ట్రంప్ ప్రభుత్వం చెబుతోంది. 'సుప్రీంకోర్టులో ఎదురు దెబ్బ తగిలిన తర్వాత **మిగతా 2లో...**

## తెలంగాణలో వర్షాలు పడకుండా క్షుద్రపూజలు

**- మాజీమంత్రి హరీష్ రావుపై పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్ ఆరోపణలు**

**హైదరాబాద్,ఆగస్టు 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** బీఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే,మాజీ మంత్రి హరీశ్ రావుపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ సంచలన ఆరోపణలు చేశారు. హరీశ్ రావు క్షుద్ర పూజలు చేస్తున్నారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో వర్షాలు పడకూడదని, కరువు రావాలని కోరుకుంటూ ఆయన క్షుద్ర పూజలు చేశారని **మిగతా 2లో...**






## పోటెత్తుతున్న వరద..

**వేగంగా నిండుతున్న శ్రీశైలం డ్యామ్**

**ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణమ్మకు పోటెత్తుతున్న వరద**

**నాగార్జునసాగర్ ఇన్‌ఫ్లో 900 క్యూసెక్కులు**

## గుజరాత్‌లో చండీపుర వైరస్‌తో 22 మంది మృతి..


**15 ఏళ్లలోపు పిల్లలకు ఎక్కువ ప్రమాదం**

**జ్వరం తర్వాత మెదడుపై దాడి చేసే అవకాశం**

**టీకా, ప్రత్యేక మందు ప్రస్తుతం లేవు**

**లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రికి వెళ్లాలి**

**కీటకాల నుంచి రక్షణే ప్రధాన నివారణ**




## పెద్ద ఎత్తున కల్తీ మసాలాల తయారీ

**25 టన్నుల కల్తీ మసాలా దినుసులు స్వాధీనం**

**13 మసాలా వ్యాపార సంస్థల్లో సోదాలు**

**కల్తీ మసాలాలలో క్యాన్సర్ వంటి ప్రమాదాలు**

**కల్తీలపై సిట్ ద్వారా దర్యాప్తు చేపడతాం**

**ఇప్పటికే ముగ్గురు నిందితుల అరెస్టు**

**నగర పోలీస్ కమిషనర్ సజ్జన్నార్ వెల్లడి**




**హైదరాబాద్,ఆగస్టు 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఆహార కల్తీకి పాల్పడుతున్న వారిపై ఉక్కుపాదం మోపుతున్న హెచ్-ఫాస్ట్ అధికారులు భారీ ఆపరేషన్ నిర్వహించి పెద్ద ఎత్తున మసాలా దినుసులు స్వాధీనం చేసుకున్నారు. నగరంలో పలు చోట్ల తనిఖీలు చేపట్టి 25 టన్నుల కల్తీ మసాలా దినుసులు స్వాధీనం చేసుకున్నట్టు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తెలిపారు. 13 మసాలా వ్యాపార సంస్థల్లో సోదాలు నిర్వహించి.. 25.3 టన్నుల కల్తీ మసాలా దినుసులు, 89.15 టన్నుల ముడిపదార్థాలను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. **మిగతా 2లో...**

## జనన మరణాల నమోదుకు కొత్త రూల్స్..

### పార్లమెంట్‌లో బిల్లుకు ఆమోదం!

ఆలస్యంగా చేసే రిజిస్ట్రేషన్లకు కఠినమైన నిబంధనలు

రెండేళ్లు దాటితే జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఉత్తర్వులు అవసరం

దేశంలో 99 శాతానికి పైగా పెరిగిన జనన, మరణాల నమోదు

గుర్తింపు మోసాలను అరికట్టడమే లక్ష్యమని తెలిపిన కేంద్రం



**న్యూఢిల్లీ,ఆగస్టు 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** దేశంలో జనన మరణాల నమోదు ప్రక్రియను మరింత పటిష్ఠం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన కీలక బిల్లుకు పార్లమెంట్ ఆమోద ముద్ర వేసింది. జనన మరణాల నమోదు (సవరణ) బిల్లు-2026కు మంగళవారం రాజ్యసభ ఆమోదం తెలిపింది. **మిగతా 2లో...**

## ప్రభుత్వ కార్యాలయాలకు టీ-ఫైబర్ ద్వారా ఇంటర్నెట్

**ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశం**

**హైదరాబాద్,ఆగస్టు 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సెప్టెంబర్ 1 నుంచి టీ-ఫైబర్ ద్వారానే ఇంటర్నెట్ సేవలు అందించాలని అధికారులను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో టీ-ఫైబర్ సేవల విస్తరణపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్ణీత గడువులోగా రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయానికి టీ-÷బైర్ కనెక్టివిటీ కల్పించాలని స్పష్టం చేశారు. **మిగతా 2లో...**



## అగమ్య గోచరంగా ప్రభుత్వాసుపత్రులు

**ప్రత్యేక వైద్యసేవలు అందక ప్రజల ఇక్కట్లు**

**కమిషనర్ లేక గాలిలోదీపంలా**

**వైద్యవిధాన పరిషత్**

**సిద్దిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శలు**

**హైదరాబాద్,4(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వాస్పత్రుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు అవసరమైన గైనకాలజీ, ఆర్థోపెడిక్, యూరాలజీ, పీడియాట్రిక్ తదితర ప్రత్యేక వైద్య సేవలను అందించే తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిస్థితి కమిషనర్ లేక **మిగతా 2లో...**



# తెలంగాణలో వర్షాలు పడకుండా క్షుద్రపూజలు

**మొదటిపేజీ తరువాయి**

మహేశ్ గౌడ్ ఆరోపించారు. అందుకు తమ వద్ద ఆధారాలు కూడా ఉన్నాయని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు. అరుంధతి సినిమా తరహాలో ఆయన పూజలు నిర్వహిస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. హరీశ్ రావు ఈ ఏడాది మార్చి 2న తమిళనాడులోని తిరుచ్చికి, జూన్ 1న కర్ణాటకలోని శివమొగ్గకు వెళ్లారని.. ఆ తేదీల్లో ఆయన ఎక్కడ ఉన్నారో ప్రజలకు వివరించాలని మహేశ్ గౌడ్ డిమాండ్ చేశారు. తిరుపతికి వెళ్లినప్పుడు మీడియాతో మాట్లాడిన హరీశ్ రావు.. అఘోరీ ఆలయానికి వెళ్లిన విషయాన్ని ఎందుకు గోప్యంగా ఉంచారని టీపీసీసీ చీఫ్ ప్రశ్నించారు. ప్రజల సంక్షేమం కోసం దేవుడిని ప్రార్థించడం సహజమని.. కానీ మాజీ మంత్రి మాత్రం ప్రజలకు కీడు జరగాలని పూజలు చేశారని విమర్శించారు.

తన రాజకీయ స్వార్థం కోసమే ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ ఆరోపణలపై నిజాలు బయటపెట్టినందుకే అద్దంకి దయాకర్, సామ రామ్మోహన్‌లకు లీగల్ నోటీసులు పంపించారని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు. అయితే లీగల్ నోటీసులకు తాము భయపడబోమని స్పష్టం చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా అఘోరాలతో క్షుద్ర పూజలు చేశారనే ప్రచారం గతంలో జరిగిందని టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ చెప్పారు. ఇప్పుడు హరీశ్ రావుపై వస్తున్న ఆరోపణలతో కేసీఆర్ పూజలు కూడా నిజమేనని అనిపిస్తోందన్నారు. యాదగిరిగుట్టకు వెళ్లి పొర్లు దండాలు పెట్టి మరీ ఏం చేశారో ప్రజలకు హరీశ్ రావు చెప్పాలని ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు. గతంలో మంత్రాలు, తంత్రాల పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన ఘటనలు ఉన్నాయని, దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో ఇలాంటి ఆచారాలను బలంగా నమ్ముతారని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు.

# పారదర్శకంగా పోలీస్ ఉద్యోగ నియామకాలు

**మొదటిపేజీ తరువాయి**



అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. సమావేశంలో సీఎం ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, డీజీపీ సీవీ ఆనంద్, హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శిఖా గోయల్, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మెన్ వివి.శ్రీనివాస రావు, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తదితరులు పాల్గొన్నారు.

# పోటెత్తుతున్న వరద..

**హైదరాబాద్,ఆగస్టు 4 (పిసిడబ్ల్యూ న్యూస్):**
ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో శ్రీశైలం జలాశయానికి కృష్ణా నది వరద ప్రవాహం పోటెత్తుతోంది. ఐదు రోజుల క్రితం ప్రవాహం ప్రారంభమైన సమయంలో 820 అడుగులుగా ఉన్న నీటిమట్టం, నిన్న సాయంత్రానికి 855.10 అడుగులకు చేరింది. ప్రస్తుతం డ్యామ్‌లో 92.048 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, ఈ సాయంత్రానికి ఈ నిల్వలు 100 టీఎంసీల మార్కును దాటుతాయని ప్రాజెక్టు అధికారులు అంచనా వేస్తున్నారు.శ్రీశైలం జలాశయం: జూరాల నుంచి సోమవారం 2.21 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా, రాత్రి సమయానికి శ్రీశైలానికి 1.55 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. రోజుకు లక్ష క్యూసెక్కులకు పైగా వచ్చే ఈ వరద ఉద్ధృతి మరో నాలుగైదు రోజులు కొనసాగవచ్చని శ్రీశైలం డ్యామ్ సీఈ కబీర్ బాషా తెలిపారు.ఎగువ కర్ణాటక ప్రాజెక్టులు: ఆలమట్టి డ్యామ్‌లోకి 1,25,855 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, దిగువకు 1.50 లక్షల క్యూసెక్కులను వదులుతున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టులోకి 1,28,954 క్యూసెక్కులు వస్తుండగా, 1,40,880 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.జూరాల ... తుంగభద్ర: నారాయణపూర్ నుంచి వస్తున్న నీటికి భీమా నది వరద జలాలు తోడవడంతో జూరాలకు ఏకంగా 1.92 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. వచ్చిన వరదను దృష్టిలో ఉంచుకొని జూరాల నుంచి 2,21,765 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. తుంగభద్ర డ్యామ్‌లోకి 57,785 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది.నాగార్జునసాగర్: నాగార్జునసాగర్‌లో ప్రస్తుతం 136 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, ఎగువ నుంచి 900 క్యూసెక్కులు వస్తున్నాయి. పులిచింతలలో 28.91 టీఎంసీల నీటినిల్వ ఉంది. ప్రకాశం బ్యారేజీలోకి 6,958 క్యూసెక్కులు చేరుతుండగా, 6,499 క్యూసెక్కులను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు.

## తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



**మొదటిపేజీ తరువాయి**

పనుల పురోగతిపై ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు.
తీరప్రాంతాల్లోని దాదాపు 33 లక్షల మంది ప్రజలకు సురక్షితమైన మంచినీటిని అందించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును రూపొందించినట్లు పవన్ వివరించారు. నిర్మాణ పనుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యత విషయంలో రాజీ పడకూడదని అధికారులకు స్పష్టం చేశారు. నిర్దేశిత వ్యవధిలోనే కీలక నిర్మాణాలను పూర్తి చేసి, ప్రాజెక్టును సాధ్యమైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. తీరప్రాంత ప్రజల తాగునీటి భద్రతను నిర్ధారించడంలో జల్ జీవన్ మిషన్ కీలక పాత్ర పోషిస్తోందని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం కొనియాడారు.

## జనన మరణాల నమోదుకు కొత్త రూల్స్..

**మొదటిపేజీ తరువాయి**

లోక్‌సభలో ఇదివరకే ఆమోదం పొందిన ఈ బిల్లు, త్వరలోనే చట్టరూపం దాల్చనుంది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు.తాజా సవరణల ప్రకారం, జనన లేదా మరణ ధ్రువీకరణ పత్రాలను ఆలస్యంగా నమోదు చేయాలంటే కఠిన నిబంధనలు వర్తిస్తాయి. ఘటన (పుట్టిన లేదా మరణించిన) జరిగిన ఏడాది తర్వాత (రెండేళ్ల లోపు) నమోదు చేయాల్సి వస్తే జిల్లా మేజిస్ట్రేట్ లేదా సబ్-డివిజనల్ మేజిస్ట్రేట్ నుంచి ముందస్తు అనుమతి పొందడం తప్పనిసరి. ఒకవేళ రెండేళ్లు దాటిన పక్షంలో, ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఉత్తర్వులు ఉంటేనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది.ఈ సందర్భంగా మంత్రి నిత్యానంద రాయ్ మాట్లాడుతూ, జనన మరణాలను నిర్ణీత సమయంలోగా నమోదు చేయడాన్ని ప్రోత్సహించడంతో పాటు, తప్పుడు సమాచారం, అవకతవకలను అరికట్టడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 3.5 లక్షల రిజిస్ట్రేషన్ యూనిట్లు అందుబాటులో ఉన్నాయని, 2014లో 86.6 శాతంగా ఉన్న జననాల నమోదు 2024 నాటికి 99 శాతానికి పైగా చేరిందని ఆయన వివరించారు. అదేవిధంగా మరణాల నమోదు 72.5 శాతం నుంచి 99.4 శాతానికి పెరిగిందని మంత్రి వెల్లడించారు.బిల్లుపై జరిగిన చర్చలో భాగంగా బీజేపీ ఎంపీ దర్శన సింగ్ మాట్లాడుతూ, ఈ కొత్త సవరణలు వ్యవస్థను మరింత సరళంగా, పారదర్శకంగా మారుస్తాయని కొనియాడారు. అయితే, రెండేళ్ల తర్వాత జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌ను ఆశ్రయించాలనే నిబంధనపై బీజేడీ ఎంపీ డాక్టర్ సంతృప్త్ మిశ్రా కొంత ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఇప్పటికే పనిభారంతో ఉన్న న్యాయస్థానాలపై మరింత ఒత్తిడి పెంచుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. వైసీపీ, కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, బీఆర్ఎస్, అన్నాడీఎంకే సహా పలు పార్టీల సభ్యులు ఈ బిల్లుకు మద్దతు తెలిపారు.

## ప్రభుత్వ కార్యాలయాలకు టీ-ఫైబర్ ద్వారా ఇంటర్నెట్

**మొదటిపేజీ తరువాయి**


సెప్టెంబర్ 1 తర్వాత ఏ ప్రభుత్వ శాఖ కూడా ప్రైవేట్ ఇంటర్నెట్ సేవలను వినియోగిస్తూ బిల్లులు చెల్లించవద్దని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ నిధుల ఆదాతో పాటు ఏకీకృత డిజిటల్ నెట్‌వర్క్ ఏర్పాటు లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ విభాగాలు వినియోగిస్తున్న టీ-స్వాన్ నెట్‌వర్క్‌ను వచ్చే నెల రోజుల్లో పూర్తిగా టీ-్గ÷బైర్‌కు బదిలీ చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన గడువు విధించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని రూపుదిద్దుకుంటున్న ఫ్యూచర్ సిటీకి అత్యాధునిక టీ-్గ÷బైర్ కనెక్టివిటీ కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని శ్రీధర్ బాబు ఆదేశించారు. అలాగే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'ఇంటింటికీ ఇంటర్నెట్' కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేసి గ్రామీణ ప్రాంతాల వరకు నాణ్యమైన బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. గడువులోగా లక్ష్యాలను పూర్తి చేసి తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ డిజిటల్ కనెక్టివిటీ కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నారు. ఇందుకు అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని మంత్రి శ్రీధర్ బాబు సూచించారు.

# ట్రంప్ తాజా సుంకాలు చట్టవిరుద్ధం

**మొదటిపేజీ తరువాయి**
ట్రంప్ ప్రభుత్వం కుటుంబాలు, వ్యాపారాలపై కొత్త టారిఫ్‌లతో భారం మోపాలని మరోసారి ప్రయత్నిస్తోంది' అని న్యూయార్క్ అటార్నీ జనరల్ లెతితియా జేమ్స్ ఓ ప్రకటనలో తెలిపారు.ప్రభుత్వం తన చర్యను ఏ విధంగా సమర్థించుకుంటున్నప్పటికీ తాను కోరుకున్న దేశాలపై అధిక సుంకాలు విధించేందుకు దేశాధ్యక్షుడికి అధికారం లేదని అమెరికా చట్టం, రాజ్యాంగం స్పష్టం చేస్తున్నాయని ఆయన అన్నారు. ట్రంప్ ప్రభుత్వ ప్రయత్నాలకు వ్యతిరేకంగా న్యాయస్థానంలో వ్యాజ్యం వేసిన రాష్ట్రాలలో న్యూయార్క్, కాలిఫోర్నియా, ఇల్లినాయిస్, మాసాచూసెట్స్, వాషింగ్టన్, విల్కాన్సిన్ సహా 18 రాష్ట్రాలు, కెంటుకీ, పెన్సిల్వేనియా గవర్నర్లు ఉన్నారు. విముక్తి దినోత్సవం సందర్భంగా ట్రంప్ ప్రభుత్వం విధించిన సుంకాలను రాజ్యాంగ విరుద్ధమైనవిగా న్యాయస్థానం గతంలో తీర్పు ఇవ్వడంతో 1974వ సంవత్సరపు వాణిజ్య చట్టంలోని సెక్షన్ 301 కింద కొత్తగా ముందుకు తెచ్చిన టారిఫ్‌లు గత నెల నుంచే అమలులోకి వచ్చాయి. ఈ కొత్త సుంకాల కారణంగా ప్రధాన వాణిజ్య భాగస్వాములైన కెనడా, జపాన్, నార్వే, తైవాన్, చైనాలపై బాగా ప్రభావం పడుతుంది. కాగా ట్రంప్ తన కార్యనిర్వాహక అధికారాన్ని అతిక్రమించారంటూ రెండు చిన్న వ్యాపార సంస్థల తరఫున లిబర్టీ జస్టిస్ సెంటర్ కూడా విడిగా వ్యాజ్యాన్ని వేసింది. బలవంతంగా పనులు చేయిస్తున్నారన్న పేరుతో ప్రభుత్వం సుంకాలను భారీగా పెంచిందని, ఇది వినియోగదారులపై అధిక ఆర్థిక భారాన్ని మోపిందని న్యూయార్క్ గవర్నర్ కాథీ హోచల్ విమర్శించారు.

# గుజరాత్‌లో చండీపుర వైరస్‌తో 22 మంది మృతి..

**గుజరాత్,ఆగస్టు 4 (పిసిడబ్ల్యూ న్యూస్):**
గుజరాత్‌లో చండీపుర వైరస్ మరోసారి కలకలం రేపుతోంది. ఈ వైరస్ కారణంగా ఇప్పటివరకు 22 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. మరో 35 మందికి వైరస్ సోకినట్లు నిర్ధారణ అయింది. సాధారణ జ్వరంలా మొదలయ్యే ఈ ఇన్‌ఫెక్షన్ కొన్ని గంటల్లోనే మెదడుపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉండటంతో వైద్యులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. అసలు చండీపుర వైరస్ అంటే ఏంటి? ఇది ఎలా వ్యాపిస్తుంది? లక్షణాలు ఏంటి? చికిత్స ఉందా? తెలుసుకుందాం..



### ఏంటీ వైరస్?
రాబ్డోవిరిడే కుటుంబానికి చెందినదే ఈ చండీపుర వైరస్ (సీహెచ్‌పీవీ). దీన్ని తొలిసారి 1965లో భారత్‌లో గుర్తించారు. వర్షాకాలంలో ఎక్కువగా కనిపించే శాండ్‌ఫ్లై (ఇసుక ఈగ) వల్ల ఇది వ్యాపిస్తుంది. మనుషుల నుంచి మనుషులకు ఈ వైరస్ సోకినట్లు ఇప్పటివరకు ఆధారాలు లేవు.

### ఎవరికి ఎక్కువ ప్రమాదం?
ఈ వైరస్ ఎక్కువగా 15 ఏళ్లలోపు చిన్నారులపై ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో, శాండ్‌ఫ్లైలు ఎక్కువగా ఉండే చోట్ల ప్రమాదం అధికంగా ఉంటుంది. వర్షాకాలంలో ఈగల సంఖ్య పెరగడంతో వైరస్ వ్యాప్తి కూడా ఎక్కువగా కనిపిస్తుంది.

### మొదట కనిపించే లక్షణాలు ఏవి?
ప్రారంభంలో ఈ వైరస్‌ను గుర్తించడం కాస్త కష్టం. ఎందుకంటే మొదట సాధారణ వైరల్ జ్వరంలాగే కనిపిస్తుంది. జ్వరం, తలనొప్పి, వాంతులు, విరేచనాలు, నీరసం, ఫ్లూ లక్షణాలు ఉంటాయి. ఈ దశలో చాలామంది సాధారణ జ్వరంగా భావించే అవకాశం ఉంటుంది.

### ఎందుకు ప్రమాదకరం?
కొంతమంది చిన్నారుల్లో వైరస్ చాలా వేగంగా మెదడుపై దాడి చేస్తుంది. దీంతో మెదడు వాపు (ఎన్‌సెఫలైటిస్) వస్తుంది. ఆ తర్వాత పరిస్థితి గంటల వ్యవధిలోనే విషమించవచ్చు.

### తీవ్రమైన లక్షణాలు ఇవీ..
మూర్ఛ, స్పృహ కోల్పోవడం, కోమాలోకి వెళ్లడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందుల వంటి తీవ్రమైన లక్షణాలు కనిపిస్తాయి. కొన్ని కేసుల్లో ఆసుపత్రిలో చేరిన 48 నుంచి 72 గంటల్లోనే ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.

### చికిత్స ఉందా?
ప్రస్తుతం చండీపుర వైరస్‌కు ప్రత్యేకంగా పనిచేసే మందు లేదు. టీకా కూడా అందుబాటులో లేదు. రోగికి కనిపించే లక్షణాలను బట్టి చికిత్స అందిస్తారు. శ్వాస, రక్తపోటు వంటి కీలక అవయవాల పనితీరును నిలకడగా ఉంచే ప్రయత్నం చేస్తారు. అందుకే లక్షణాలు కనిపించగానే ఆలస్యం చేయకుండా ఆసుపత్రికి తీసుకెళ్లడం కీలకం.

### ఎలా జాగ్రత్త పడాలి?
చండీపుర వైరస్‌కు ప్రత్యేక టీకా లేకపోవడంతో నివారణే ఉత్తమ మార్గం. శాండ్‌ఫ్లై కాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లలకు పూర్తి చేతులు కవర్ అయ్యేలా దుస్తులు వేయాలి. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. కీటకనాశక ద్రావణాలు, దోమతెరలు ఉపయోగించాలి. జ్వరం, వాంతులు, మూర్ఛలు కనిపిస్తే వెంటనే వైద్యుణ్ని సంప్రదించాలి.

### ఎందుకు అప్రమత్తంగా ఉండాలి?
చండీపుర వైరస్ చాలా అరుదుగా కనిపించినా, ఒకసారి సోకితే వేగంగా తీవ్ర స్థితికి చేరుకునే ప్రమాదం ఉంది. అందుకే పిల్లల్లో సాధారణ జ్వరంతో పాటు నాడీ సంబంధిత లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్య పరీక్షలు చేయించాలని నిపుణులు సూచిస్తున్నారు.

# పెద్ద ఎత్తున కల్తీ మసాలాల తయారీ

**మొదటిపేజీ తరువాయి**

3 క్రిమినల్ కేసుల్లో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్టు చెప్పారు. సింథటిక్ రంగులు, క్లాత్ డైలు, టాల్కమ్ పౌడర్లు, ఇండస్ట్రియల్ కలర్స్, రైస్ బ్రాన్ అయిల్ నకిలీ మసాలాల్లో వినియోగించినట్టు గుర్తించామన్నారు. కల్తీ మసాలాల వల్ల ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదముందని హెచ్చరించారు. కల్తీ ఆహార పదార్థాల కేసులపై త్వరలో ప్రత్యేక సిట్ ఏర్పాటు చేస్తామని సజ్జనార్ తెలిపారు. ఈ మేరకు
హైదరాబాద్ కల్తీ మసాలా తయారీముఠా కేసులో హైదరాబాద్ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ కేసులో సిట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించామని హైదరాబాద్ సీపీ సజ్జనార్ ప్రకటించారు. ప్రమాదకర రసాయనాలతో టన్నుల మసాలా దినుసులను తెలుగు రాష్ట్రాలకు ఈ ముఠా సరఫరా చేస్తోందని తెలిపారు. సిట్ ఏర్పాటు చేసి సమగ్ర దర్యాప్తు చేస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో కల్తీ మసాలాల తయారీ కేంద్రాలపై హెచ్ -ఫాస్ట్ మెరుపు దాడులు చేసిందని సీపీ పేర్కొన్నారు. 13 మసాలా వ్యాపార సంస్థల్లో తనిఖీలు నిర్వహించామని తెలిపారు. ప్రజల సమాచారం ఆధారంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని చెప్పుకొచ్చారు. 25 టన్నులకుపైగా కల్తీ మసాలాలు స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. కల్తీ మసాలాల కేసుల్లో ముగ్గురిని అరెస్ట్ చేశామని అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి, బాలాపూర్ పోలీస్ స్టేషన్లలో మూడు కేసులు నమోదు అయ్యాయని వెల్లడించారు. వాము, జీలకర్ర, లవంగం, షాజీరా, ఆవాలు సహా పలు మసాలాల్లో కల్తీ చేసినట్లు గుర్తించామని తెలిపారు. ఫ్యాబ్రిక్ డైలు, సింథటిక్ కలర్స్‌తో మసాలాలు తయారీ చేస్తున్నారని సీపీ సజ్జనార్ తెలిపారు. టాల్కమ్ పౌడర్, ఇండస్ట్రియల్ డైలు, రైస్ బ్రాన్ ఆయిల్ వినియోగిస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. మసాలాలకు మెరుపు కోసం హానికర రసాయనాలను వినియోగిస్తున్నారని తెలిపారు. రంగులు వేసి నాణ్యమైన మసాలాల మాదిరిగా విక్రయిస్తున్నారని చెప్పుకొచ్చారు. 89 టన్నులకుపైగా ముడి పదార్థాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఆహార భద్రత చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కల్తీ మసాలాల నమూనాలను ల్యాబ్ పరీక్షలకు పంపామని వెల్లడించారు. కల్తీ ఆహారం వల్ల కాలేయం, మూత్రపిండాలకు ముప్పు పొంచి ఉందని సీపీ సజ్జనార్ హెచ్చరించారు. ఈ మసాలాలతో క్యాన్సర్, అలర్జీలు, జీర్ణ సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. ఊ-ఈం÷ ఏర్పడిన 140 రోజుల్లో 659 ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించామని అన్నారు. 202 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, 246 టన్నుల కల్తీ ఆహారాన్ని స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ప్రజలు
అనుమానాస్పద ఆహారంపై వెంటనే తమకు ఫిర్యాదు చేయాలని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

# అగమ్య గోచరంగా ప్రభుత్వాసుపత్రులు

**మొదటిపేజీ తరువాయి**
గాలిలో దీపంలా మారడం శోచనీయమని తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా హరీశ్‌రావు పోస్టుపెట్టారు. గత రెండు నెలలుగా పూర్తిస్థాయి అధికారి లేకపోవడంతో ÷ఎఖ పరిధిలోని ఎంసీహెచ్, జిల్లా ఆస్పత్రులు, ఏరియా ఆస్పత్రులు, సీహెచ్సీ మొత్తంగా 184 ఆస్పత్రుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆస్పత్రుల పనితీరు, ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, వైద్యుల హాజరు, ల్యాబ్ పరీక్షలు, మందుల లభ్యత తదితర అంశాలను పర్యవేక్షించే అధికార యంత్రాంగమే లేకుండా పోయిందని హరీశ్‌రావు చెప్పుకొచ్చారు. దీంతో ఒకవైపు వైద్యులు, వైద్య సిబ్బంది సమస్యలు పరిష్కారం కాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మరోవైపు కాంగ్రెస్ పాలనలో ప్రజలు సరైన వైద్య సేవలు అందక అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య సిబ్బంది వేతనాలు, సర్వీస్ సమస్యలు సహా ఇతర సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో ÷ఎఖని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌గా మార్చి ప్రభుత్వంలో విలీనం చేయాలని తమ హయాంలో నిర్ణయించామని ప్రస్తావించారు. దాదాపు మూడేళ్లు గడుస్తున్నా సర్వీసు నిబంధనలు రూపొందించక పోవడం, లక్ష్యం కార్యరూపం దాల్చకపోవడం దురదృష్టకరమని హరీశ్‌రావు అన్నారు. దీంతో వైద్యులు, వైద్య సిబ్బంది తీవ్ర నిరాశకు గురవుతున్నారని చెప్పుకొచ్చారు. ఇదే విషయమై ఉద్యోగులు ప్రభుత్వానికి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా లాభం లేకుండా పోతుందని తెలిపారు. రో÷-లడెక్కి నిరసనలు తెలియచేస్తున్నా పట్టించుకోకపోవడం దుర్మార్గమని అన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది సమస్యలతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఇకనైనా నిర్లక్ష్యాన్ని వీడాలని డిమాండ్ చేశారు. వెంటనే డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌కు సంబంధించి వెంటనే కమిటీ వేసి సర్వీస్ నిబంధనలు, మార్గదర్శకాలు రూపొందించాలని, తక్షణమే పూర్తిస్థాయి అధికారిని నియమించాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# చిన్నారుల ప్రాణదాత డాక్టర్ వెంకటేశ్వర్లు చిరస్మరణీయులు

**ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన ప్రముఖ బాలవైద్యులు డాక్టర్ బొడ్ల వెంకటేశ్వర్లకు కన్నీటి నివాళి**

**రాజ్యాంగ పరిరక్షణ వేదిక వ్యవస్థాపకులు, జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాదిక్ అలీ**





**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన ప్రముఖ బాలవైద్యులు, ప్రభుత్వ ఆసుపత్రి మాజీ సూపరింటెండెంట్, దివంగత డాక్టర్ బొడ్ల వెంకటేశ్వర్లు మృతి వైద్య రంగానికే కాకుండా సమాజానికే తీరనిలోటని, ఆయన సేవలు చిరస్మరణీయమని రాజ్యాంగ పరిరక్షణ వేదిక వ్యవస్థాపకులు, జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాదిక్ అలీ అన్నారు. సోమవారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా సయ్యద్ సాదిక్ అలీ మాట్లాడుతూ... డాక్టర్ బొడ్ల వెంకటేశ్వర్లు వైద్యాన్ని కేవలం వృత్తిగా కాకుండా మానవ సేవగా భావించి జీవితాంతం వేలాది మంది చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ కోసం అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన చిన్నారులకు సైతం అపారమైన ప్రేమ, ఆప్యాయతతో నాణ్యమైన వైద్య సేవలు అందించి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని అన్నారు. రోగికి కేవలం చికిత్స చేయడమే కాదు, వారి కుటుంబాలకు ధైర్యం చెప్పే గొప్ప మానవతావాది డాక్టర్ బొడ్ల వెంకటేశ్వర్లని పేర్కొన్నారు. ఆయన నిరాడంబర జీవనం, సేవా తపన, వృత్తిపట్ల నిబద్ధత, మానవీయ విలువలు నేటి తరానికి ఆదర్శప్రాయమని అన్నారు. వైద్య రంగానికి ఆయన అందించిన సేవలు ఎన్నటికీ మరువలేనివని, వేలాది మంది చిన్నారులకు పునర్జన్మ ప్రసాదించిన మహనీయుడని గుర్తు చేసుకున్నారు. డాక్టర్ బొడ్ల వెంకటేశ్వర్ల మరణంతో ఖమ్మం జిల్లా ఒక గొప్ప బాలవైద్యుడిని కోల్పోయిందని, ఆయన చూపిన సేవా మార్గాన్ని అనుసరిస్తూ ప్రజలకు అంకితభావంతో సేవ చేయడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అవుతుందని సయ్యద్ సాదిక్ అలీ అన్నారు. కుటుంబ సభ్యులు ఈ విషాదాన్ని ధైర్యంగా ఎదుర్కోవాలని ఆకాంక్షిస్తూ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ పరామర్శ కార్యక్రమంలో రిటైర్డ్ అదనపు ఎస్పీ మాధవరావు, బొడ్ల కిరణ్ ప్రసాద్, బొడ్ల కృష్ణ ప్రసాద్, బొడ్ల హరిప్రసాద్, బొడ్ల రమేష్ బాబు, అర్వపల్లి రామకృష్ణ, అర్వపల్లి అశోక్ కుమార్, అర్వపల్లి నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

# థింసా నృత్యానికి గిన్నిస్ రికార్డుపై కరీంనగర్‌లో బీజేపీ ఎస్టీ మోర్చా సంబరాలు....





**కరీంనగర్ ఆగస్టు 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఆంధ్రప్రదేశ్ ఎన్డీఏ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవ వేడుకల సందర్భంగా 13 వేల మంది గిరిజనులతో నిర్వహించిన థింసా నృత్యం గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, గిరిజన, బంజారా సంస్కృతి, సంప్రదాయ నృత్యాలకు నేడు ప్రపంచ గుర్తింపు లభించిన శుభ సందర్భాన్ని పురస్కరించుకుని బిజెపి ఎస్టి మోర్చా జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రోజున కరీంనగర్ పట్టణం తెలంగాణ చౌక్లో సంబరాలు నిర్వహించారు. గిరిజన కళలకు ప్రపంచస్థాయిలో లభించిన అరుదైన గౌరవాన్ని పురస్కరించుకుని ఈ సందర్భంగా బిజెపి ఎస్టీ మోర్చా నాయకులు, కార్యకర్తలు బాణాసంచా కాల్చి, మిఠాయిలు, పండ్లు పంపిణీ చేసి తమ ఆనందాన్ని పంచుకున్నారు. స్థానిక ప్రజలకు, ప్రయాణికులకు పండ్లు పంపిణీ చేసి చారిత్రాత్మక విజయాన్ని ఘనంగా సెలబ్రేట్ చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు రమావత్ శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచ వేదికపై వెలుగులు విరజిమ్మడం గర్వకారణమని, ఏపీ ఎన్డీఏ ప్రభుత్వ చొరవతో గిరిజన కళలకు ఈ గుర్తింపు దక్కిందని కొనియాడారు. థింసా నృత్యానికి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ లభించడం మరువలేని అనుభూతిలాంటిదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాస్ , కార్పొరేటర్లు ఎన్నం లక్ష్మీ ప్రకాష్ , పెద్దపల్లి జితేందర్ మీడియా ఇన్చార్జ్ కటకం లోకేష్ సోషల్ మీడియా పార్లమెంట్ కన్వీనర్ ఉప్పరపల్లి శ్రీనివాస్ , బిజెపి కరీంనగర్ జిల్లా కార్యాలయ కార్యదర్శి గుంజేటి శివకుమార్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు సంఘ నరేష్ , ఎస్టి మోర్చా రాష్ట్ర కార్యదర్శి గుగులోతు శ్రీకాంత్ నాయక్, , ఎస్టి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కట్ట రాజు, మరియు ఎస్టి మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇస్లావత్ శ్రీనివాస్ నాయక్ , బిజెపి పార్టీ ఎస్టి మోర్చా నాయకులు.కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లంపల్లి జలాలపై చర్చకు సిద్ధమా?..



**కాళేశ్వరం ఎత్తిపోతలు కాదు..**

**ఫామ్‌హౌస్‌లో ఎత్తిపోతల పథకం..**

**రామడుగు, ఆగస్టు 05(పిసిడబ్ల్యూ న్యూస్):** రామడుగు మండలం లక్ష్మీపూర్ గ్రామంలోని గాయత్రి పంపు వద్ద చొప్పదండి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఈ సందర్భంగా కోల రమేష్ రామడుగు మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జవ్వాజి హరీష్ ఆధ్వర్యంలో పాత్రికేయుల సమావేశంనిర్వహించారు. ఈ సందర్భంగా కోల రమేష్ జవ్వాజి హరీష్ లు మాట్లాడుతూ టిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో వేలాది కోట్ల రూపాయలతో కాళేశ్వరం ప్రాజెక్టును మేడిగడ్డ వద్ద నిర్మించి కూలేశ్వరం ప్రాజెక్టుగా నామకరణం చేసుకోవాలని సూచించారు. ఆదివారం టిఆర్ఎస్ నాయకులు ఎల్లంపల్లి నంది మేడారం లక్ష్మీపూర్ పంప్ హౌస్ లను పరిశీలించి అనంతరం వేద పండితులతో పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం మంత్రులపై టిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాజీ ఎంపీ వినోద్ కుమారులు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఖండించారు. వేలాది కోట్ల రూపాయల ప్రజల సొమ్ముతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి లక్ష కోట్ల కమిషన్లకు కక్కుర్తి పడి దుర్వినియోగం చేశారని అన్నారు. ఆనాటి మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ఎల్లంపల్లి శ్రీపాద ప్రాజెక్టు ఇందిరమ్మ వరద కాలువ నిర్మించింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు.. గోదావరి వరద జలాలు ఎల్లంపల్లి కి వస్తుంటే కాళేశ్వరం మేడిగడ్డ అన్నారం సుందిళ్ల నుండి గ్రావిటీ ద్వారా నీళ్లు ఎల్లం పెల్లికి వస్తున్నాయని విషపు వార్తలు ప్రజలకు ప్రచారం చేస్తున్నారని అన్నారు.. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టిన చోటికి వెళ్లకుండా ఎల్లంపల్లి నంది మేడారం గాయత్రి పంప్ హౌస్ల వద్దకు వచ్చి టిఆర్ఎస్ నాయకులు వెళ్లడం ఏంటని ప్రశ్నించారు.. కాళేశ్వరం కట్టిన కన్నెపల్లి పంప్ హౌస్ వద్దకు మేము కాంగ్రెస్ పార్టీ నాయకులం రావడం సిద్ధంగా ఉన్నామని మీరు ఎప్పుడు వస్తారో దమ్ముంటే పత్రికా ముఖంగా రావాలని సవాల్ విసిరారు. నాటి నుండి నేటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇందిరమ్మ హాయంలో శ్రీరామ్ సాగర్ వైయస్ హాయంలో ఎల్లంపల్లి ఇందిరమ్మ వరద కాలువ లాంటి ప్రాజెక్టులను పూర్తిచేసిన ఘనత కాంగ్రెస్ పార్టీ దేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండున్నర ఏళ్లలో రైతుల పంటలు ఒక్క మడి కూడా ఎండ లేదని అన్నారు కాళేశ్వరం పేరుతో వేలాది కోట్ల రూపాయలను కమిషన్ల కక్కుర్తి కోసమే నిర్మించారని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను అప్పటి బి ఆర్ ఎస్ ప్రభుత్వంనుదుయ్యబట్టారు... మరోసారి ఎల్లంపల్లి జలాలపై అసత్యపు వార్తలను ప్రచారం చేస్తే ప్రజల ముందే టిఆర్ఎస్ నాయకులకు దేహశుద్ధి తప్పదని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ రామడుగు మండల అధ్యక్షులు జవ్వాజి హరీష్ బీసీ సెల్ జిల్లాచైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్ ఆరు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి మంత్రి మహేందర్ బత్తిని శ్రీనివాస్ గౌడ్ నాగభూషణ్ రెడ్డి సునీల్ యాదవ్ మార్కెట్ కమిటీ పాలకవర్గం ఉపాధ్యక్షులు పిండి సత్యం రెడ్డి 6 మండల కాంగ్రెస్ పార్టీఅధ్యక్షులు ఉప్ప శ్రీనివాస్ రెడ్డి, మంత్రి మహేందర్, బతిని శ్రీనివాస్ గౌడ్, నాగభూషణ్ రెడ్డి, సువిన్ యాదవ్, ఉప్పని అంజన్న ప్రసాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి పంజాల శ్రీనివాస్ గౌడ్ ఆరు మండలాల మార్కెట్ కమిటీ పాలకవర్గం సింగిల్ విండో పాలకవర్గం, వివిధ మండలాల మైనార్టీ నాయకులు వివిధ గ్రామాల సర్పంచులు రైతులు ప్రజా ప్రతినిధులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# టైలరింగ్ కేంద్రాన్ని పరిశీలించిన అడిషనల్ కలెక్టర్, ఎంపీడీవో



**హనుమకొండ ఆగస్టు 04(పిసిడబ్ల్యూ న్యూస్):** దామెర మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని మంగళవారం రోజున జిల్లా అడిషనల్ కలెక్టర్, ఎంపీడీవో, స్వయం సహాయక సంఘాల పర్యవేక్షణ అధికారులు సీసీలతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భనలో భాగంగా మహిళలకు అందిస్తున్న కుట్టు శిక్షణ తీరును, వారి నైపుణ్యాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి మరియు స్వయం ఉపాధి పొందడానికి ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అడిషనల్ కలెక్టర్ తెలిపారు. కేంద్రంలో సౌకర్యాలు, శిక్షణ పొందుతున్న మహిళల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్‌తో పాటు మండల పరిషత్ అభివృద్ధి అధికారి, డీపీఎం, ఏపీఎం, సీసీలు శిక్షణ పొందుతున్న మహిళలు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్ బలి... పొలంలో పని చేస్తూ రైతు మృతి

**మల్లంపల్లి మండలంలో తీవ్ర విషాదం.. దేవనగర్ రైతు పొర్ల వీరయ్య దుర్మరణం**





**మల్లంపల్లి మండల ప్రతినిధి ఆగస్టు 5(పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా మల్లంపల్లి మండలంలోని దేవనగర్ గ్రామంలో మంగళవారం విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పొర్ల వీరయ్య (తండ్రి: ముత్తయ్య) తన వ్యవసాయ పొలంలో పని చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం ప్రకారం, పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లిన సమయంలో విద్యుత్ వైర్లు తగలడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. తోటి రైతులు వెంటనే గమనించి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వీరయ్య అకాల మరణంతో దేవనగర్ గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణ ఆర్థిక సహాయం అందించి అన్ని విధాలా ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# 59, 60వ డివిజన్లలో రూ.20 లక్షల అభివృద్ధి పనులకు మేయర్ శ్రీనివాస్ శ్రీకారం





**కరీంనగర్,ఆగస్టు4(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరంలో మౌలిక వసతుల అభివృద్ధికి నగరపాలక సంస్థ ప్రాధాన్యత ఇస్తోందని మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. నగరంలోని వివిధ డివిజన్లలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను దశలవారీగా చేపడుతూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో 59వ డివిజన్‌లో మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రూ. 10 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ డ్రైన్ పనులకు మేయర్ శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తదుపరి 60వ డివిజన్‌లో మరో రూ. 10 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు, సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు కూడా శంకుస్థాపన చేశారు. ఈ పనులు పూర్తయితే కాలనీల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని మేయర్ తెలిపారు. నగరంలోని ప్రతి డివిజన్‌లో అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే నగరపాలక సంస్థ లక్ష్యమని, చేపట్టిన పనులను నాణ్యతతో పాటు నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్‌రావు, కార్పొరేటర్లు మజీద్ హుస్సేన్, నసీం సుల్తానా ఇబ్రహీం, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.



PCW తెలుగు దినపత్రిక

బుధవారం 05 ఆగస్టు 2026

# కళకళలాడుతున్న ప్రభుత్వ పాఠశాల





**మూతపడిన బడి నుంచి ఆదర్శ పాఠశాలగా**

**సమిష్టి కృషికి విజయగాథ**

**మూడుళ్ల క్రితం జీరో ఎన్‌రోల్మెంట్**

**గ్రామస్తులు సర్పంచ్ ఉపాధ్యాయుల అంకితభావంతో పునర్జన్మ పొందిన విద్యాలయం**

**రెగ్యులర్ ఉపాధ్యాయులను నియమించి పాఠశాలను శాశ్వతంగా బలోపేతం చేయాలని గ్రామస్తుల విజ్ఞప్తి**








**కల్లూరు, ఆగస్టు 4 (పిసిడబ్ల్యూ న్యూస్) :**ఒకప్పుడు విద్యార్థుల కొరతతో మూతపడిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నేడు విద్యార్థుల కేరింతలతో కళకళలాడుతూ ప్రభుత్వ విద్యకు ఆదర్శంగా నిలుస్తోంది గ్రామ ప్రజలు ప్రజాప్రతినిధులు ఉపాధ్యాయుల సమిష్టి కృషి ఉంటే ప్రభుత్వ పాఠశాలలను ఎలా అభివృద్ధి చేయవచ్చో ఈ పాఠశాల నిరూపిస్తోంది. 2023లో జీరో ఎన్‌రోల్మెంట్ కారణంగా మూతపడిన ఈ పాఠశాలను గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు 2025లో బడిబాట కార్యక్రమంలో భాగంగా అప్పటి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పునఃప్రారంభించారు. మాజీ ఎస్ఎంసీ చైర్మన్ మాలోతు నరసింహారావు కృషి, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ సహకారంతో పాఠశాల అభివృద్ధికి రూ. 10 లక్షలు మంజూరయ్యాయి. అనంతరం జిల్లా కలెక్టర్ సాధారణ బదిలీల కారణంగా కొంత అంతరాయం ఏర్పడినా గ్రామస్తులు వెనుకడుగు వేయకుండా పాఠశాల అభివృద్ధిని కొనసాగించారు. జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ కూడా పాఠశాల అభివృద్ధి కోసం రూ. 2 లక్షలు మంజూరు చేయడం విశేషం. ఆ నిధులతో మౌలిక సదుపాయాలు మెరుగుపడి పాఠశాల రూపురేఖలే మారిపోయాయి. విద్యార్థుల చేరిక కోసం ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో లభించే ఉచిత విద్య, ఆంగ్ల బోధన, ఇతర సౌకర్యాలను తల్లిదండ్రులకు వివరించి విద్యార్థులను చేర్పించారు. ప్రస్తుతం ఈ పాఠశాల మండలంలోనే ఆదర్శ పాఠశాలగా గుర్తింపు పొందింది. అధికారులు పలుమార్లు ప్రశంసాపత్రాలు అందజేయడం విశేషం. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ఆంగ్ల మాధ్యమ బోధనతో పాటు విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందిస్తూ ఉపాధ్యాయులు విశేష సేవలు అందిస్తున్నారు. అయితే పాఠశాలలో ఇప్పటికీ రెగ్యులర్ ఉపాధ్యాయులు లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం చిన్న కోరుకొండి నుంచి డిప్యూటేషన్‌పై వచ్చిన తాళ్లూరు రవి, కప్పలబంధం నుంచి వచ్చిన చిలక రజిని సేవలందిస్తున్నారు. వీరు తిరిగి తమ అసలు పాఠశాలలకు వెళ్లాల్సి వస్తే ఈ పాఠశాల భవిష్యత్తు మళ్లీ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాలోతు అనురాధ నరసింహారావు మాట్లాడుతూ డిప్యూటేషన్ పై వచ్చిన ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి పాఠశాలను తిరిగి నిలబెట్టారు. వారి సేవలు గ్రామ ప్రజల మన్ననలు పొందాయి. వీరినే రెగ్యులర్‌గా ఈ పాఠశాలలో కొనసాగించాలి. ఒకవేళ అది సాధ్యం కాకపోతే వెంటనే శాశ్వత ఉపాధ్యాయులను నియమించి ప్రభుత్వ పాఠశాల మనుగడను కాపాడాలి అని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడాలంటే భవనాలు నిర్మించడం మాత్రమే కాదు. అంకిత భావంతో పనిచేసే ఉపాధ్యాయులు, సహకరించే గ్రామస్తులు, చొరవ చూపే ప్రజా ప్రతినిధులు ఉంటేనే ప్రభుత్వ విద్యకు పూర్వ వైభవం తిరిగి వస్తుందనే విషయాన్ని ఈ పాఠశాల మరోసారి చాటి చెబుతోంది.

# పెన్ డౌన్.. షట్ డౌన్

**● తక్షణమే పే స్కేల్ అమలు చేయాలి ● వి బి జి రామ్ జి పథకం**

**ఉద్యోగుల నిరసన కార్యక్రమం: ఏపీవో హేమలత**




**కల్లూరు, ఆగస్టు 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** వి బి జి రామ్ జి పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం ప్రకటించిన విధంగా తక్షణమే పే స్కేల్ అమలు చేయాలని మూడు రోజులుగా పెన్ డౌన్ షట్ డౌన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏపీవో హేమలత తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ గత 20 ఏళ్ళుగా ఇదే పథకంలో చాలీచాలని జీతాలతో పనిచేస్తున్నట్లు తెలిపారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతున్నట్టు తెలిపారు. నాన్ యఫ్ టి ఇ ఉద్యోగులను యఫ్ టి ఇ లుగా గుర్తించాలని ప్రతి నెలా క్రమం తప్పకుండా వేతనాలు చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. గత మూడు నెలలుగా వేతనాలు అందక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఉద్యోగ భద్రతతో పాటు పే స్కేల్ అమలు చేయాలని కోరారు. ప్రతి నెలా నిర్దిష్ట తేదీన జీతాలు చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తమ సమస్యలు పరిష్కరించబడే వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగుల ఐక్యతతో ప్రజాస్వామ్యబద్ధమైన ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టి ఎ లు, కంప్యూటర్ ఆపరేటర్లు, పాల్గొన్నారు.

# మళ్లీ వెలిగిన విద్యాదీపం..!

**పిల్లల కొరతతో మూతపడిన పాఠశాల... మరోసారి చిన్నారుల కేరింతలతో కళకళ**

**ఒక్క విద్యార్థితో పునఃప్రారంభం... ప్రస్తుతం ఎనిమిది మందితో విద్యా ప్రస్థానం**





**కల్లూరు,ఆగస్టు 4 (పిసిడబ్ల్యూ న్యూస్) :**ఒకప్పుడు విద్యార్థుల కొరతతో తలుపులు మూసుకున్న ఆ పాఠశాల... నేడు మరోసారి చిన్నారుల కేరింతలతో మారుమోగుతోంది. వెలవెలబోయిన తరగతి గదులు మళ్లీ విద్యార్థుల సందడితో కళకళలాడుతున్నాయి. ఒకే ఒక్క విద్యార్థితో తిరిగి ప్రారంభమైన ఈ పాఠశాల ప్రస్తుతం ఎనిమిది మంది విద్యార్థులతో అభివృద్ధి బాటలో నడుస్తూ గ్రామంలో కొత్త ఆశలను నింపుతోంది. విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గిపోవడం, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపడం, గ్రామంలో జనాభా మార్పులు వంటి కారణాలతో ఈ పాఠశాల కొన్నేళ్ల క్రితం మూతపడింది. దీంతో గ్రామంలో ప్రభుత్వ విద్యకు ఎదురుదెబ్బ తగిలింది. చిన్నారులు దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే గ్రామ ప్రజలు, విద్యాభిమానులు, విద్యాశాఖ అధికారులు కలిసి పాఠశాలను తిరిగి ప్రారంభించేందుకు కృషి చేశారు. వారి ప్రయత్నాలు ఫలించి పాఠశాల మళ్లీ తెరుచుకుంది. ప్రారంభంలో కేవలం ఒకే ఒక్క విద్యార్థి చేరినా, ఉపాధ్యాయులు నిరుత్సాహపడకుండా అదే ఉత్సాహంతో బోధన కొనసాగించారు. ప్రతి విద్యార్థికి వ్యక్తిగత శ్రద్ధ, సులభమైన బోధనా విధానాలు, ఆటలతో కూడిన అభ్యాసం, పరిశుభ్రమైన పాఠశాల వాతావరణం కల్పించడంతో తల్లిదండ్రుల్లో విశ్వాసం పెరిగింది. ఫలితంగా ఒక్కొక్కరిగా విద్యార్థుల చేరికలు పెరిగి ప్రస్తుతం ఎనిమిది మంది చిన్నారులు విద్యాభ్యాసం చేస్తున్నారు. విద్యార్థుల సంఖ్య చిన్నదే అయినప్పటికీ, నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. చదువుతో పాటు క్రమశిక్షణ, పరిశుభ్రత, నైతిక విలువలు, సృజనాత్మ కతకు ప్రాధాన్యం ఇస్తూ పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తున్నారు. గ్రామస్తుల సహకారం, తల్లిదండ్రుల నమ్మకం, ఉపాధ్యాయుల అంకితభావం కలిస్తే మూతపడిన పాఠశాల కూడా మళ్లీ నిలదొక్కుకోగలదనే విషయాన్ని ఈ పాఠశాల నిరూపిస్తోంది. రానున్న విద్యా సంవత్సరంలో మరింత మంది విద్యార్థులను చేర్చుకోవాలని, పాఠశాలను ఆదర్శ విద్యాలయంగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

## భారీ వర్షానికి ఇంట్లోకి చేరిన వరద నీరు.. బాధిత కుటుంబానికి అండగా నిలిచిన మేయర్ కొలగాని శ్రీనివాస్





**కరీంనగర్, ఆగస్టు 4 (పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 26వ డివిజన్ సుభాష్‌నగర్ ప్రాంతంలో నిన్న రాత్రి కురిసిన భారీ వర్షాలకు ఓ ఇంటిలోకి వరద నీరు చేరిన ఘటనపై నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ వెంటనే స్పందించారు. సమాచారం అందుకున్న వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం మున్సిపల్ అధికారులు, సిబ్బందికి తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించిన మేయర్, ఇంటిలోకి చేరిన వరద నీటిని ఎత్తిపోసే పనులను స్వయంగా పర్యవేక్షించారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పడంతో పాటు అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, సమస్యలు తలెత్తిన వెంటనే స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని మేయర్ శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 26వ డివిజన్ కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్, అసిస్టెంట్ కమిషనర్ రాజ మనోహర్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి ఇంటిపై జాతీయ జెండా రెపరెపలాడాలి... దేశభక్తిని చాటి చెప్పండి...

**'హర్ ఘర్ తిరంగా ప్రోగ్రాం లను సక్సెస్ చేయండి...**

**బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి..**



**కరీంనగర్ ఆగస్టు 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఆగస్టు 15న జరగబోయే 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని హర్ ఘర్ తిరంగా ప్రోగ్రాం, 'తిరంగా యాత్ర' లను సక్సెస్ చేయాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. బిజెపి జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రోజున కరీంనగర్లోని పార్లమెంటు కార్యాలయంలో హర్ ఘర్ తిరంగా ప్రోగ్రాం కు సంబంధించి మండల అధ్యక్షులతో సన్నాక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ తిరంగా యాత్ర నిర్వహణ కోసం బిజెపి శ్రేణులు సమాయత్తం కావాలని, దేశభక్తిని చాటేలా ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు నియోజకవర్గాల్లో తిరంగా యాత్రలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 13 నుంచి 15 వరకు ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసే కార్యక్రమాన్ని విజయవంతం చేపట్టి, ప్రజలు విద్యార్థులు ఇట్టి కార్యక్రమంలో పెద్ద ఎత్తున భాగస్వామ్యం అయ్యేలా చూడాలన్నారు. అలాగే ఆగస్టు 12 నుంచి 14 వరకు మహాపురుషుల, స్వాతంత్ర సమరయోధుల విగ్రహాలు శుద్ధి చేసి , స్మారక చిహ్నాల చుట్టూ ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు అన్ని మండలాల్లో తిరంగా ర్యాలీలు నిర్వహించాలన్నారు. ఆగస్టు 14న దేశ విభజన నాటి దారుణాలను గుర్తుచేసుకుంటూ ఎగ్జిబిషన్లు, హాల్ మీటింగ్‌లు ఏర్పాటు ఏర్పాటు చేయాలని తెలిపారు. జాతీయ పార్టీ పిలుపుమేరకు దేశంలోని అన్ని రాష్ట్రాలలో ఆగస్టు 10 నుండి ఈ కార్యక్రమాలు ప్రారంభమవుతున్నాయని తెలిపారు. మండల నియోజకవర్గ స్థాయిల్లో తిరంగా యాత్రలు, బైక్ ర్యాలీలు నిర్వహించి, దేశ సరిహద్దులను కాపాడిన అమరవీరుల కుటుంబాలను, ఫ్రీడమ్ ఫైటర్స్ ను బీజేపీ నాయకులు స్వయంగా కలిసి గౌరవించే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా బీజేపీ జాతీయ నాయకత్వం ఈ ప్రచారాన్ని కేవలం ఒక ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా, ప్రతి పౌరుడిని మానసికంగా దేశంతో అనుసంధానించే సామాజిక ఉద్యమంగా మార్చాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలను ప్రతి ఏటా నిర్వహిస్తుందని గంగాడి కృష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలోబిజెపి మాజీ జిల్లా అధ్యక్షులు బాస సత్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుగొండనాగేశ్వర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు, తిరంగా అభియాన్ ప్రోగ్రాం కన్వీనర్ సాయిని మల్లేశం, సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాస్ , బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు నేరెళ్ల ప్రవీణ్ రెడ్డి , ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి రాజు అడిచెర్ల మోర్చాల అధ్యక్షులు బత్తుల లక్ష్మీనారాయణ, సంఘ నరేష్, ఆకుల రాజేందర్ జోన్, కిసాన్ మోర్చా అధ్యక్షులు మోతె గంగారెడ్డి మండల అధ్యక్షులు, జిల్లా నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రెడ్డి రామయ్యపల్లె వరకు లోకల్ బస్సులు నడపాలని వినతి



**కరీంనగర్/కొత్తపల్లి ఆగస్టు 4(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్‌లో ఇటీవల ప్రారంభించిన కొత్త లోకల్ బస్ సర్వీసులను కొత్తపల్లిలోని రెడ్డి రామయ్యపల్లె బస్టాండ్ షెల్టర్ వరకు పొడిగించాలని స్థానికులు కోరుతున్నారు. గతంలో లోకల్ బస్సులు ఆ ప్రాంతం వరకు నడిచేవని, ప్రస్తుతం నిలిపివేయడంతో ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రెడ్డి రామయ్యపల్లె వరకు బస్సులను నడిపేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని, మున్సిపల్ కార్పొరేటర్ వాసాల రమేష్ తో స్థానికులు విజ్ఞప్తి చేశారు.

# తెలంగాణ సంస్కృతికి బోనాలు ప్రతీక

**హైదరాబాద్, ఆగస్టు 04(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు బోనాలు ప్రతీకగా నిలుస్తాయని ఐపిఎం డైరెక్టర్ డాక్టర్ సి. శివలీల అన్నారు. మంగళవారం నారాయణగూడ లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపిఎం) ప్రాంగణంలోని దుర్గాదేవి ఆలయంలో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సంయుక్త ఆధ్వర్యంలో బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పాల్గొని బోనాల వేడుకలను ప్రారంభించి ఉద్యోగ సంఘాల నేతలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ఏలూరు శ్రీనివాస్ రావు, ముజీబ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, ఎం. సత్యనారాయణగౌడ్, రాసూరి జ్ఞానేశ్వర్, బంగ్లా సుశీల్, ఎం. శ్రీనివాస్ రావు, నవీన్ కుమార్, శ్రీకాంత్, మహేష్, ప్రదీప్, సంతోష్, నరేష్, ప్రశాంత్, డి. ప్రభాకర్, కన్నె రమేష్ యాదవ్, బల్వీర్, డాక్టర్ విజయశాంతి, డాక్టర్ ఉమా, డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ సాయితేజ, జగన్మోహన్ మోహన్ రావు, డాక్టర్ రమా, శైలజ, ముకరాల చంద్రశేఖర్ గౌడ్, కుల్కచర్ల శ్రీనివాస్, డాక్టర్ అయోషా, డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ సబిత, డాక్టర్ దివ్యకీర్తి, డాక్టర్ కలీల్, పాల్గొన్నారు.



# వెంకట్ సాయినగర్ కాలనీలో ఘనంగా శ్రీ మైసమ్మ అమ్మవారి 4వ వార్షికోత్సవ వేడుకలు

**ఉప్పల్ ఆగస్టు 04(పిసిడబ్ల్యూ న్యూస్):** రామంతపూర్ బగాయత్ వెంకట్ సాయినగర్ కాలనీలో శ్రీ శ్రీ శ్రీ మైసమ్మ దేవాలయంలో అమ్మవారి 4వ, వార్షికోత్సవ వేడుకలు మంగళవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం గణపతి హోమం, అమ్మవారి అభిషేకం, కుంకుమార్చన కార్యక్రమాలను వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కాలనీ వాసులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో కాలనీ ప్రజలందరూ




సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మల్యాల బాలయ్య, రాచమల్ల రమేష్, సికినమెట్ల ప్రభులింగం, సర్వసత్తయ్య యాదవ్ గోపాల్ అన్న , నరసింహులు , ఐలేష్ యాదవ్ , రమేష్ యాదవ్ మురళి , శివ యాదవ్ శ్రీనివాస్ చందన్ సింగ్ యాదమ్మ రాజు చంద్రయ్య , రాజు యాదవ్ , సత్యనారాయణ,సారయ్య శంకర్, అనిల్ గణేష్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు

# వ్యక్తిగత దూషణలు మానుకోకపోతే పరువు నష్టం దావా వేస్తా: ఊగిలే సుధాకర్ పటేల్



**కరీంనగర్, ఆగస్టు4(పీసీడబ్ల్యూ న్యూస్):** జనసేన నాయకుడు, న్యాయవాది భేతి మహేందర్ రెడ్డి తనపై వ్యక్తిగత ఆరోపణలు చేస్తూ ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేస్తున్నారని, ఈ తరహా ప్రచారాన్ని వెంటనే నిలిపివేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఊగిలే సుధాకర్ పటేల్ హెచ్చరించారు. మంగళవారం కరీంనగర్‌లో ఆయన మాట్లాడుతూ, తన హిందుత్వ భావజాలం, పార్టీ పట్ల నిబద్ధత గురించి అందరికీ తెలుసని అన్నారు. దశాబ్దాలుగా బీజేపీ జెండా కింద హిందువుల ఐక్యత కోసం పనిచేస్తున్నానని పేర్కొన్నారు. కార్పొరేషన్ ఎన్నికల నాటి నుంచి భేతి మహేందర్ రెడ్డి తనపై కక్షతో అసత్య ప్రచారం చేస్తూ వ్యక్తిగతంగా దూషిస్తున్నారని ఆరోపించారు. రాజకీయంగా విమర్శలు చేయడం వేరు, వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుని చౌకబారు వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఇప్పటి వరకు తన ప్రతిష్టకు భంగం కలిగించే వ్యాఖ్యలను సహనంతో భరించానని, ఇకపై కూడా ఇదే విధంగా వ్యవహరిస్తే అందుబాటులో ఉన్న సాక్ష్యాధారాలతో భేతి మహేందర్ రెడ్డిపై కోర్టులో పరువు నష్టం దావా వేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటానని సుధాకర్ పటేల్ స్పష్టం చేశారు.

# హుజూరాబాద్‌లో బీజేపీకి షాక్.. కీలక నేతల రాజీనామా

**హుజూరాబాద్,ఆగస్టు4(పీసీడబ్ల్యూ న్యూస్):** హుజూరాబాద్ నియోజకవర్గంలో బీజేపీకి రాజకీయంగా గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పార్టీకి చెందిన పలువురు కీలక నాయకులు, కార్యకర్తలు తమ పదవులకు, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు సమాచారం. ఈ పరిణామం స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పార్టీలో తమకు తగిన ప్రాధాన్యత లభించడం లేదని, స్థానిక నాయకత్వ వ్యవహార శైలిపై అసంతృప్తితోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాజీనామా చేసిన నేతలు పేర్కొన్నట్లు తెలుస్తోంది. కొందరు నాయకులు త్వరలోనే ఇతర రాజకీయ పార్టీల్లో చేరే అవకాశాలు ఉన్నాయని ప్రచారం సాగుతోంది. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న సమయంలో చోటుచేసుకున్న ఈ పరిణామం బీజేపీ



శ్రేణులను ఆందోళనకు గురిచేస్తోంది. అయితే పార్టీ నాయకత్వం అసంతృప్త నేతలతో చర్చలు జరిపి పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రయత్నాలు ప్రారంభించినట్లు సమాచారం. మరోవైపు, ఈ పరిణామం రానున్న స్థానిక రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపే అవకాశముందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు

# బంకిపూర్ ఉప ఎన్నికలో బీజేపీ ఓటమి గుణపాఠం: జూపాక శ్రీనివాస్



**కరీంనగర్, ఆగస్టు 4 (పీసీడబ్ల్యూ న్యూస్):** బంకిపూర్ ఉప ఎన్నికలో బీజేపీకి ఎదురైన ఓటమి దేశ రాజకీయాల్లో కీలక పరిణామమని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథా కరీంనగర్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన అనంతరం జరిగిన ఉప ఎన్నికలో మూడు దశాబ్దాలకు పైగా బీజేపీ ఆధిపత్యం కొనసాగిన స్థానంలో ఆ పార్టీ ఓటమి పాలవడం ప్రజాభిప్రాయంలో వచ్చిన మార్పుకు నిదర్శనమని అన్నారు. ఎన్నికల కమిషన్ ప్రాథమిక అంచనాల ప్రకారం బీజేపీ ఓట్ల శాతం గణనీయంగా తగ్గినట్లు వెల్లడైందని తెలిపారు. ఇటీవల జరిగిన విద్యార్థుల ఆందోళనల అనంతరం వెలువడిన ఈ ప్రజా తీర్పు అహంకార రాజకీయాలు, విభజన విధానాలు, ప్రజా వ్యతిరేక పాలనను ప్రజలు తిరస్కరించగలరనే విషయాన్ని స్పష్టం చేసిందన్నారు. ప్రజలు నిరంకుశత్వాన్ని కాకుండా జవాబుదారీతనం, ప్రజాస్వామ్య విలువలు కలిగిన పాలనను కోరుకుంటున్నారనే స్పష్టమైన సందేశాన్ని ఈ ఎన్నికల ఫలితం ఇచ్చిందని పేర్కొన్నారు. ఉప ఎన్నికలో విజయం సాధించిన ప్రశాంత్ కిషోర్‌కు అభినందనలు తెలియజేసిన జూపాక శ్రీనివాస్.. దేశవ్యాప్తంగా మతతత్వ, కార్పొరేట్ ఎజెండాను ఎదుర్కొనేందుకు ప్రజా పోరాటాలను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజాస్వామ్య, లౌకిక శక్తుల విస్తృత ఐక్యతను నిర్మించడం నేటి ప్రధాన కర్తవ్యమని పిలుపునిచ్చారు.

# అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లాన్ని పట్టుకున్న పోలీసులు

**- వాహనాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు**




**తొర్రూరు ప్రతినిధి, ఆగస్టు 4(పిసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా, తొర్రూరు పోలీస్ స్టేషన్ పరిధిలో నల్ల బెల్లాన్ని పట్టుకున్న తొర్రూర్ పోలీసులు. అక్రమంగా నల్ల బెల్లం సరఫరా చేస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా లావుడియా సురేష్, జాటోత్ నటేష్ మరియు నవీన్ నల్ల బెల్లం తరలిస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులను గమనించిన నవీన్ అక్కడి నుంచి పరారయ్యాడు. లావుడియా సురేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకోగా, పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని తోరూర్ ఎస్సై మహేందర్ తెలిపారు. ఈ దాడిలో 45 బస్తాల నల్ల బెల్లం (సుమారు 2,250 కిలోలు), ఒక స్విఫ్ట్ కారు మరియు ఒక అశోక్ లేలాండ్ వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# ఎస్ఎఫ్ఐ ధర్నాకు సంఘీభావం తెలిపిన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ బాబు



**ఏటూరునాగారం,ఆగస్టు 4 (పీసీడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా ఏటూరునాగారంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు పాల్గొని విద్యార్థులకు సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. విద్యార్థుల హక్కులు, విద్యా సౌకర్యాల కోసం ఎస్ఎఫ్ఐ చేపడుతున్న పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ పూర్తి మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. కాకులమర్రి ప్రదీప్ రావు, తాడూరి రఘు, కుమ్మరి చంద్రబాబు, కొండాయి చిన్ని, ఎస్ఎఫ్ఐ నాయకులు, కార్యకర్తలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, శ్రేణులు పాల్గొన్నారు.

# హుస్సేనిపురా రహదారుల దుస్థితి.. ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం





**కరీంనగర్, ఆగస్టు 4 (పీసీడబ్ల్యూ న్యూస్):** భారీ వర్షాల కారణంగా కరీంనగర్ నగరంలోని హుస్సేనిపురా ప్రాంతంలో రహదారులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. రోడ్లపై పెద్దఎత్తున గుంతలు ఏర్పడటంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుంతలను పూడ్చేందుకు అధికారులు ఎర్రటి కంకర పోసినప్పటికీ, వర్షానికి అది కొట్టుకుపోవడంతో పరిస్థితి మరింత దయనీయంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రహదారి మొత్తం బురద, ఎర్రటి కంకరతో నిండిపోవడంతో నడవడం కూడా కష్టంగా మారిందని చెబుతున్నారు. ఎన్నికల సమయంలో అభివృద్ధి హామీలు ఇచ్చి, ఆధునిక రహదారులు నిర్మిస్తామని చెప్పిన ప్రజాప్రతినిధులు ప్రస్తుతం ఈ సమస్యపై స్పందించడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. హుస్సేనిపురా ప్రాంతంలో దెబ్బతిన్న రహదారులను శాశ్వతంగా మరమ్మతు చేసి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# వాగు ఉధృతితో పంట పొలాలకు వెళ్లలేక రైతుల అవస్థలు

- బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని రైతులు ఆందోళన.
- పట్టించుకోని పాలకులు, అధికారులు.



**తొర్రూరు ప్రతినిధి, ఆగస్టు 4(పిసిడబ్ల్యూ న్యూస్):** అందరికీ అన్నం పెట్టేది రైతే. ఆ రైతుకు ఎన్ని కష్టాలు. రైతు అంటే అధికారులకు ఇంత చిన్నచూపు ఎందుకు అంటున్న గ్రామస్తులు?. మహబూబాబాద్ జిల్లా,తొర్రూరు మండలం అమ్మాపురం గ్రామం నుండి కంటాయపాలెం గ్రామానికి వెళ్లే రహదారిలో ఉన్న వాగుపై సాధారణ వర్షం వచ్చినప్పుడు రైతులు వారితో పాటు కూలీలు కూడా వాగు దాటలేని పరిస్థితి నెలకొని ఉంటుంది. తక్షణమే బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని అమ్మాపురం, కంటాయపాలెం రైతులు మంగళవారం వాగు వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ... గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రధానమంత్రి సధక్య యోజన పథకం కింద రూ. 2.95 కోట్లతో సృజన కన్స్ట్రక్షన్ టెండర్ వేసి బ్రిడ్జి నిర్మాణం చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో వాగు ఉధృతి కారణంగా చుట్టుపక్కల రైతులు పంట పొలాలకు వెళ్లాలంటే వాగు దాటి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పలుమార్లు స్థానిక ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎలాంటి ఫలితం లేదని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, సంబంధిత అధికారులు స్పందించి కొత్తవారికి టెండర్ ఇచ్చి బ్రిడ్జి నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు అమ్మాపురం మాజీ ఎంపీటీసీ డోనుక ఉప్పలయ్య, పాక వెంకన్న, పాక యాకయ్య, పేరబోయిన అశోక్, పేరబోయిన యాదగిరి, పాక అమరేందర్, పాక బ్రహ్మం గుంటుక లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీల పెండింగ్ విద్యుత్ బిల్లులు మాఫీ చేయాలి

**- ఏంపిడీఓకు వినతి ఇచ్చిన నడికూడ మండల పలు గ్రామాల సర్పంచ్‌లు**



**నడికూడ,ఆగస్టు 4 (పీసీడబ్ల్యూ న్యూస్):** నడి కూడ మండలంలోని అన్ని గ్రామాల గ్రామపంచాయతీ ల విద్యుత్ బిల్లు మాఫీ చేయాలని మంగళవారం నడికుడ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆర్ రామకృష్ణకు పలు గ్రామాల సర్పంచులు వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీలలో హార్దిక పరిస్థితి ప్రస్తుతం క్లిష్టంగా ఉందని గ్రామాలలో పారిశుద్ధ్యం తాగునీటి సరఫరా వీధి దీపాల నిర్వహణ వంటి మౌలిక సేవలను సమర్ధవంతంగా కొనసాగించాలంటే పెండింగ్లో గ్రామపంచాయతీ ల విద్యుత్ బిల్లులను ప్రభుత్వమే పూర్తిగా మాఫీ చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేస్తున్నామని అన్నారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సర్పంచుల మండల ఫోరం అధ్యక్షులు దొగ్గల కుమారస్వామి పురం ప్రధాన కార్యదర్శి వెంకటేష్ నర్సక్క పల్లి సర్పంచ్ ముత్యాలు పులిగిల్ల సర్పంచ్ పద్మ చర్లపల్లి సర్పంచ్ బండి రేణుక కౌకొండ సర్పంచ్ ఓదెల శ్రీలత తదితరులు పాల్గొన్నారు

# గ్రామపంచాయతీ కార్మికులకు రైన్ కోట్‌ల పంపిణీ చేసిన సర్పంచ్ మహమ్మద్ మొయిజ్

**రామడుగు, ఆగస్టు 04(పిసిడబ్ల్యూ న్యూస్):** రామడుగు గ్రామ సర్పంచ్ మహమ్మద్ మొయిజ్ ఆధ్వర్యంలో తన స్వంత ఖర్చులతోరామడుగు గ్రామంలో నిరంతరం శ్రమిస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది కార్మికులకువర్షాకాల ప్రభావం దృష్ట్యా వారికి ఇబ్బంది కలగకుండా వారి సౌకర్యార్థం రైన్ కోట్ లను పంపిణీ చేయడం జరిగింది.గ్రామ పంచాయతీ సిబ్బంది హర్షం వ్యక్తం చేసి సర్పంచ్ మహమ్మద్ మొయిజ్ కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహమ్మద్ మొయిజ్ ఉప సర్పంచ్ పెందోట రాజు కార్యదర్శి శ్రీనివాస్ పాలకవర్గం వార్డు సభ్యులు మామిడి దిలీప్ కుమార్,ఎం ఆరీఫ్,రాగం స్వప్న - రవి, కర్నె శ్రీలత, శ్రీనివాస్, కారుపాకల నరేష్, మామిడి శ్రవణ్ , సిరికొండ పల్లవి - సాయి తేజ, నీలం అరుణ - లక్ష్మణ్, సామంతుల సుజాత - తిరుపతి, చంద అనిల్, మ్యాడారం అర్చన - అనిల్, సిరిగిరీ వెంకటేశం,మామిడి కుమార్ గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



## అటవీ జంతువుల వేటలో నిందితుల అరెస్ట్



**కల్లూరు,ఆగస్టు 4 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తల్లాడ ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని కల్లూరు సెక్షన్‌లో ఇటీవల అక్రమంగా విద్యుత్ తీగలు ఏర్పాటు చేసి ఎలుగుబంటిని హతమార్చిన కేసులో పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితులను అటవీ శాఖ అధికారులు సోమవారం మధ్యాహ్నం చాకచక్యంగా అరెస్టు చేశారు. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు నిందితులను అరెస్టు చేసి సత్తుపల్లి న్యాయస్థానంలో హాజరుపరచగా, న్యాయస్థానం వారిని 15 రోజుల జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించిన విషయం విదితమే. ఈ కేసులో పరారీలో ఉన్న అజ్మీర కృష్ణ (కొత్తబోడు మల్లె గ్రామం) ఏనుగంటి రామకృష్ణ (లోకారం గ్రామం) కోసం తల్లాడ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఉమా ఆధ్వర్యంలో ప్రత్యేక రెక్కీ నిర్వహించి, సోమవారం మధ్యాహ్నం వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని సత్తుపల్లి న్యాయస్థానంలో హాజరుపరచగా, న్యాయస్థానం 11 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో ఖమ్మం జిల్లా కారాగారానికి తరలించారు. ఈ సందర్భంగా తల్లాడ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ జి ఉమా మాట్లాడుతూ, అటవీ నేరాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, అటవీ మరియు వన్యప్రాణి సంరక్షణ చట్టాల ప్రకారం నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అడవుల్లో అక్రమ వేట, విద్యుత్ తీగల ఏర్పాటు వంటి నేరాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి. సురేష్ కుమార్, డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రమేష్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ (కోర్టు డ్యూటీ), నక్క రమేష్, అజమ్ ఆలీ (ఫారెస్ట్ బీట్ ఆఫీసర్), తెనాలి శీను, తేజవత్ కృష్ణ, అంజద్ పాషా, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# తొర్రూరు వ్యవసాయ మార్కెట్ల అభివృద్ధికి రూ.3.35 కోట్ల నిధులు మంజూరు

**- నియోజకవర్గంలోని తొర్రూరు, కొడకండ్ల రైతులకు శుభవార్త**

**- ఎమ్మెల్యే కృషి ఫలించిన వేళ**

**తొర్రూరు ప్రతినిధి, ఆగస్టు 4(పీసీడబ్ల్యు న్యూస్):** పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే యశస్విరెడ్డి నియోజకవర్గ రైతులకు, ప్రజలకు కృషి చేస్తూనే ఉన్నారు. కృషి వెనుక ఆమె కష్టం ఎంతో దాగి ఉంది. పాలకుర్తి నియోజకవర్గ అభివృద్దే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్న పాలకుర్తి శాసనసభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి వ్యవసాయ మార్కెట్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. నియోజకవర్గంలోని రైతులకు ఆధునిక వసతులు కల్పించాలనే ఉద్దేశంతో వ్యవసాయ శాఖ మంత్రి, మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులను పలు మార్లు కలిసి, మార్కెట్ యార్డుల సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన నిధులు మంజూరు చేయాలని గట్టిగా విజ్ఞప్తి చేయడంతో పాటు నిధుల కోసం నిరంతరం కృషి చేశారు. ఎమ్మెల్యే పట్టుదల, ప్రత్యేక



చొరవ ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం కోడకండ్ల మరియు తొర్రూరు వ్యవసాయ మార్కెట్ కమిటీల అభివృద్ధి పనులకు మొత్తం రూ. 3.35 కోట్ల పరిపాలనా అనుమతిని మంజూరు చేసింది. కోడకండ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీకి రూ. 2.43 కోట్లు మంజూరు కాగా, మార్కెట్ యార్డులో భారీ కవర్డ్ షెడ్ నిర్మాణం, టాయిలెట్ బ్లాక్ నిర్మాణం, ఆర్.ఓ. ప్లాంట్‌తో కూడిన గది నిర్మాణం, దేవరుప్పుల సబ్ మార్కెట్ యార్డులో నాబార్డ్ గోదాం చుట్టూ పాక్షిక ప్రహరీ గోడ నిర్మాణం వంటి కీలక అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. అలాగే తొర్రూరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి రూ. 92 లక్షలు మంజూరై, మార్కెట్ యార్డు ప్రధాన ద్వారం నుంచి గోదాం వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. ఈ పనులు పూర్తయితే రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు తీసుకురావడంలో మరింత సౌకర్యం కలగనుంది. ఈ నిధుల మంజూరుతో పాలకుర్తి నియోజకవర్గంలోని వ్యవసాయ మార్కెట్లు మరింత ఆధునికంగా రూపుదిద్దుకోనున్నాయని, రైతులకు మెరుగైన వసతులు అందుబాటులోకి రానున్నాయని స్థానిక రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా కోడకండ్ల, తొర్రూరు వ్యవసాయ మార్కెట్ కమిటీల చైర్మన్లు, పాలకవర్గ సభ్యులు, రైతులు, హమాలీలు, వ్యాపారులు మరియు ప్రజాప్రతినిధులు పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ఈ నిధులను మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, వ్యవసాయ మరియు మార్కెటింగ్ శాఖ మంత్రి కి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## అంబర్ పేట్ బోనాలకు మహేష్ కుమార్ గౌడ్‌ను ఆహ్వానించిన కాంగ్రెస్ నేతలు



**హైదరాబాద్, ఆగస్టు 04(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలుగు సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా తెలంగాణ బోనాలు నిలుస్తాయని పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఆషాడ మాస బోనాల సందర్భంగా అంబర్ పేట్ లో నిర్వహించే బోనాల పండుగకు ముఖ్యఅతిథిగా హాజరు కావాలని కోరుతూ.. కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణ గౌడ్,అంబర్ పేట్ మహంకాళి దేవస్థాన కమిటీ ప్రధాన కార్యదర్శి బింది మల్లికార్జున గౌడ్, కాంగ్రెస్ యువ నేత దిలీప్ కుమార్ నేత తదితరులు మహేష్ కుమార్ గౌడ్, సిడబ్ల్యుసి వర్కింగ్ కమిటీ సభ్యుడు గిరుగు రుద్రరాజ్ లను మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో బోనాలు అత్యంతగా వైభవంగా జరుపుకోవడం సంప్రదాయంగా వస్తుందని తెలిపారు. దేవాలయ అలంకరణ కోసం ప్రభుత్వం బోనాల పండుగకు ప్రత్యేక నిధులను కేటాయించిందన్నారు. తెలంగాణ ప్రజలు బోనాలను ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

# విద్యార్థుల భవిష్యత్తుకు గ్రంథాలయాలే బంగారుబాట

**జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.డి. ఖాదర్ బాబా**

**కామేపల్లి, పండితాపురం శాఖా గ్రంథాలయాల పరిశీలన..**

**శిథిల భవనాలకు కొత్త రూపు**

**జ్ఞాన మందిరాలకు కొత్త ఊపిరి...**

**పోటీ పరీక్షల అభ్యర్థులకు అవసరమైన ప్రతి పుస్తకం అందుబాటులోకి తెస్తాం**

**విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా..**

**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 4 (పిసిడబ్ల్యూ న్యూస్) :** గ్రంథాలయాలు కేవలం పుస్తకాలు నిల్వచేసే భవనాలు కావు... అవి జ్ఞానానికి ఆలయాలు, విద్యార్థుల కలలకు పునాది, నిరుద్యోగ యువత ఆశయాలకు మార్గదర్శకాలు. అలాంటి జ్ఞాన కేంద్రాలు మరింత మెరుగైన సేవలు అందించేలా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.డి. ఖాదర్ బాబా, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి. పద్మజతో కలిసి మంగళవారం కామేపల్లి మండలంలోని కామేపల్లి, పండితాపురం శాఖా గ్రంథాలయాలను సందర్శించి భవనాల పరిస్థితి, గ్రంథాలయ నిర్వహణ, పాఠకులకు అందుతున్న





సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పండితాపురం శాఖా గ్రంథాలయ భవనం శిథిలావస్థలో ఉండటంతో విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ తాత్కాలిక భవనంలో గ్రంథాలయాన్ని కొనసాగించి, త్వరలోనే నూతన భవనం నిర్మాణానికి చర్యలు చేపడతామని చైర్మన్ తెలిపారు. అలాగే కామేపల్లి శాఖా గ్రంథాలయం కూడా శిథిలావస్థలో ఉండటంతో దానిని తాత్కాలిక భవనానికి మార్చి సేవలను అంతరాయం లేకుండా కొనసాగిస్తూ, కొత్త భవనం నిర్మాణానికి అవసరమైన చర్యలు వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎం.డి. ఖాదర్ బాబా మాట్లాడుతూ... నేటి పోటీ ప్రపంచంలో గ్రంథాలయాల పాత్ర మరింత కీలకంగా మారిందన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న నిరుద్యోగ యువత, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని "రీడర్స్ ఆన్ డిమాండ్" విధానంలో వారు కోరిన పుస్తకాలను కొనుగోలు చేసి గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. "ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఒక్క పుస్తకం కూడా కొనలేని విద్యార్థికి గ్రంథాలయం ఆశాకిరణంగా నిలవాలి. ప్రతి విద్యార్థి తన కలను సాకారం చేసుకునే వేదికగా గ్రంథాలయాలు మారాలి. జ్ఞానమే జీవితాన్ని మార్చే శక్తి. ఆ జ్ఞానాన్ని అందరికీ చేరవేయడమే జిల్లా గ్రంథాలయ సంస్థ లక్ష్యం" అని ఆయన పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు, నిరుద్యోగ యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని తమ లక్ష్యాలను చేరుకోవాలని, కష్టపడి చదివి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి కుటుంబాలతో పాటు సమాజానికి గర్వకారణంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి. పద్మజ, సీనియర్ అసిస్టెంట్ పి. సంతోష్, గ్రంథపాలకులు ఎం. నవీన్ కుమార్, కార్యాలయ సిబ్బంది భాస్కర్, పార్ట్‌టైమ్ వర్కర్ రమేష్, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## 59వ డివిజన్ కార్యాలయంలో తెలంగాణ కుటుంబ రిజిస్టర్ సర్టిఫికేట్ల పంపిణీ..



**కరీంనగర్, ఆగస్టు 4 (పీ.సీ.డబ్ల్యూ. న్యూస్):** కరీంనగర్ జిల్లా ముకర్రంపుర 59వ డివిజన్ కార్యాలయంలో తెలంగాణ కుటుంబ రిజిస్టర్ సర్టిఫికేట్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల సర్టిఫికేట్లు మంగళవారం ఆమోదం పొందాయి. ఈ సందర్భంగా సర్టిఫికేట్లను సంబంధిత దరఖాస్తుదారులకు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. తమవద్ద ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి మొహమ్మద్ అఖీల్ ఫిరోజ్ తెలంగాణ కుటుంబ రిజిస్టర్ సర్టిఫికేట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ముకర్రంపుర 59వ డివిజన్ ప్రజలకు సర్టిఫికేట్లు ఆమోదం పొందిన విషయాన్ని తెలియజేస్తూ, మిగతా లబ్ధిదారులు కూడా తమ సర్టిఫికేట్లను కార్యాలయం నుండి పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఫ్లోర్ లీడర్, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్ (59వ డివిజన్, ముకర్రంపుర) పాల్గొన్నారు. సర్టిఫికేట్లు అందుకున్న వారందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజలకు మరిన్ని సేవలను అందించేందుకు నిరంతరం కృషి చేస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు.

# కలం వీడిన అక్షర యోధుడు

**జర్నలిస్ట్ సత్యానందం అకాల మరణం జర్నలిజానికి తీరనిలోటు**

**ప్రజాసమస్యలపై కలమెత్తిన నిజాయితీ శ్రమజీవికి టిడబ్ల్యూజేఎఫ్ నివాళులు**

**కుటుంబానికి అండగా ఉంటాం**

**తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) ఖమ్మం జిల్లా అధ్యక్షులు సయ్యద్ ఖదీర్**

**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 4 (పీసీడబ్ల్యూ న్యూస్) :** సమాజ హితమే ఊపిరిగా, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అహర్నిశలు శ్రమించిన నిజాయితీగల వర్కింగ్ జర్నలిస్ట్ మంద సత్యానందం అకాల మరణం ఇటు జర్నలిస్టు లోకానికి, అటు సమాజానికి తీరని లోటని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) ఖమ్మం జిల్లా అధ్యక్షులు సయ్యద్ ఖదీర్ తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. ప్రమాదాలు, ప్రతికూల పరిస్థితులను సైతం లెక్కచేయకుండా అక్షరాన్నే ఆయుధంగా మలచి, క్షేత్రస్థాయిలో వార్తల కోసం తపించిన ఒక అక్షర యోధుడిని కోల్పోవడం జర్నలిస్టు సమాజాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి, వేదనకు గురిచేసిందని ఆవేదన చెందారు.



బోనకల్ మండలం గోవిందాపురం గ్రామానికి చెందిన టిడబ్ల్యుజేఎఫ్ సభ్యుడు, 'విజన్ ఆంధ్ర' విలేకరి మంద సత్యానందం సోమవారం రాత్రి జరిగిన దారుణ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వార్త విని తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. మంగళవారం ఆయన భౌతికకాయాన్ని సందర్శించిన జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సయ్యద్ ఖదీర్ పూలమాలలు వేసి అశ్రునయనాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా సయ్యద్ ఖదీర్ మాట్లాడేటప్పుడు వాతావరణం అత్యంత భావోద్వేగ భరితంగా మారింది. "జర్నలిస్టుల జీవితాలు సమాజ శ్రేయస్సు కోసమే అంకితం. కష్టనష్టాలను ఓర్చి, సొంత సుఖాలను పక్కనబెట్టి నిత్యం ప్రజాక్షేత్రంలో గడిపే విలేకరి మరణిస్తే, అది కేవలం ఆ కుటుంబానికి మాత్రమే కాదు... సమాజానికి గొంతుకగా నిలిచే ఒక బలమైన అక్షరానికి ఓటమి. సత్యానందం నిరంతరం ప్రజా సమస్యలపై స్పందిస్తూ, నిబద్ధత కలిగిన పాత్రికేయుడిగా పేరు తెచ్చుకున్నారు. మృత్యువు రోడ్డు ప్రమాదం రూపంలో వచ్చి ఆయనను ఇంత చిన్న వయస్సులోనే మన నుంచి దూరం చేయడం అత్యంత బాధాకరం" అని వాపోయారు. ఆయన సేవలు, జ్ఞాపకాలు జర్నలిస్టుల గుండెల్లో నిరంతరం సజీవంగా ఉంటాయని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవం తుడిని ప్రార్థించారు. రోడ్డు ప్రమాదంలో అకస్మాత్తుగా ఇంటి పెద్దను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న సత్యానందం కుటుంబ సభ్యులను సయ్యద్ ఖదీర్ ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ కష్టసమ యంలో జర్నలిస్టు యూనియన్ (టిడబ్ల్యూజేఎఫ్) ఆ కుటుంబానికి పూర్తి అండదండగా ఉంటుందని, అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా కోశాధికారి తేనె వెంకటేశ్వర్లు, మాజీ జిల్లా కార్యదర్శి పల్లా కొండల రావు, యూనియన్ నాయకులు షేక్ అర్షద్ ఖాన్, ఇంటి ప్రసాద్, 'నవ తెలంగాణ' సర్క్యులేషన్ జిల్లా ఇన్చార్జి ఇరుగు వెంకటేశ్వర్లు తదితర జర్నలిస్టు మిత్రులు పాల్గొని సత్యానందంకు ఘన నివాళులర్పించారు.

## కేంద్ర మంత్రి వ్యాఖ్యలను ఖండించిన జిల్లా కాంగ్రెస్ చైర్మన్ మహమ్మద్ తాజోద్దీన్..



**కరీంనగర్, ఆగస్టు 4 (పీ.సీ.డబ్ల్యూ. న్యూస్):** కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి ఇటీవల చేసిన వ్యాఖ్యలను జిల్లా కాంగ్రెస్ చైర్మన్ మహమ్మద్ తాజోద్దీన్ తీవ్రంగా ఖండించారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, కేంద్ర మంత్రి హోదాలో ఉన్న వ్యక్తి హుందాగా వ్యవహరించి, ప్రజలను ఐక్యంగా ఉంచేలా మాట్లాడాలని అన్నారు. మతాల మధ్య విభేదాలు సృష్టించేలా వ్యాఖ్యలు చేయడం బాధ్యతాయుతమైన నాయకత్వానికి తగదని పేర్కొన్నారు. రంజాన్ సందర్భంగా ప్రభుత్వం నిధులు కేటాయించడాన్ని ప్రస్తావిస్తూ ముస్లింలపై చేసిన వ్యాఖ్యలు అనుచితమని ఆయన విమర్శించారు. హిందువులు, ముస్లింలు ఎన్నో ఏళ్లుగా సోదరభావంతో కలిసి జీవిస్తున్నారని, వారి మధ్య రాజకీయ ప్రయోజనాల కోసం విభేదాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేయడం సరికాదన్నారు. ప్రజలకు అవసరమైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని, కుల, మత అంశాలను రాజకీయాలకు ఉపయోగించవద్దని కేంద్ర మంత్రికి సూచించారు. ప్రజలు అభివృద్ధి పనులను బట్టి నాయకులను ఆదరిస్తారని, విద్వేష రాజకీయాలను కాదని మహమ్మద్ తాజోద్దీన్ పేర్కొన్నారు.


# మానవత్వమే మహోన్నత ధర్మం..

**మానవ హక్కుల పరిరక్షణే సంస్థ లక్ష్యం**

**ఖమ్మంలో హెచ్ఆర్సీసీఐ జిల్లా నూతన కార్యాలయం ఘనంగా ప్రారంభం**

**సేవాభావంతో ముందుకు రావాలని సభ్యులకు జాతీయ అధ్యక్షుడు సింగమల వెంకటరమణయ్య పిలుపు**







**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 4 (పీసీడబ్ల్యూ న్యూస్) :** సమాజంలో ప్రతి వ్యక్తికి రాజ్యాంగం కల్పించిన హక్కులు సక్రమంగా అందేలా కృషి చేయడం, అణగారిన వర్గాలకు అండగా నిలవడం, బాధితులకు భరోసా కల్పించడం ప్రతి సామాజిక సంస్థ బాధ్యత అని మానవ హక్కుల పరిరక్షణ సంస్థ (హెచ్ఆర్సీసీఐ) వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు సింగమల వెంకటరమణయ్య అన్నారు. మానవత్వాన్ని కాపాడే ప్రతి అడుగు సమాజానికి వెలుగునిస్తుందని, సేవా దృక్పథంతో పనిచేసే వ్యక్తులే సంస్థకు నిజమైన బలమని ఆయన పేర్కొన్నారు. మానవ హక్కుల పరిరక్షణ సంస్థ ఖమ్మం జిల్లా నూతన కార్యాలయం మంగళవారం ఖమ్మం నగరంలోని ఎన్టీఆర్ సర్కిల్, ఇల్లందు క్రాస్‌రోడ్డు వద్ద జిల్లా చైర్మన్ పుచ్చకాయల దేవేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి చింతల రవి ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా విచ్చేసిన సంస్థ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు సింగమల వెంకటరమణయ్య నూతన కార్యాలయాన్ని ప్రారంభించి సంస్థ కార్యకలాపాలకు శుభారంభం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మానవ హక్కుల పరిరక్షణ అనేది కేవలం ఒక బాధ్యత మాత్రమే కాకుండా సమాజంపై ప్రతి ఒక్కరికీ ఉన్న నైతిక కర్తవ్యమని అన్నారు. సంస్థలో చేరే వారు పదవుల కోసం, వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా సేవాభావం, నిజాయితీ, నిబద్ధతతో ముందుకు రావాలని సూచించారు. సంస్థ నియమ నిబంధనలను ప్రతి సభ్యుడు తూచా తప్పకుండా పాటిస్తూ ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించాలని, బాధితులకు న్యాయం అందించడంలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ కిషోర్ కుమార్, రాష్ట్ర వర్కింగ్ చైర్మన్ బెస్త సంజీవరావు, రాష్ట్ర జనరల్ సెక్రటరీ మోటపోతుల బాబురావు, రాష్ట్ర మహిళా చైర్మన్ పాదం అజంతా, రాష్ట్ర కార్యదర్శి సంకా గణేష్ కుమార్ మాట్లాడుతూ, మానవ హక్కుల పరిరక్షణ కోసం సంస్థ చేపట్టే ప్రతి కార్యక్రమం సమాజంలో చైతన్యాన్ని పెంపొందించేలా ఉండాలని ఆకాంక్షించారు. ప్రజల సమస్యలను గుర్తించి బాధితులకు అండగా నిలవడమే సంస్థ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. జిల్లా చైర్మన్ పుచ్చకాయల దేవేందర్ మాట్లాడుతూ... ఖమ్మం జిల్లాలో మానవ హక్కుల పరిరక్షణ కోసం సంస్థను మరింత బలోపేతం చేస్తామని, ప్రతి గ్రామం, ప్రతి మండలానికి సంస్థ సేవలను విస్తరించి ప్రజలకు అండగా నిలుస్తామని తెలిపారు. సమాజంలో ఎక్కడ అన్యాయం జరిగినా స్పందించే సంస్థగా హెచ్ఆర్సీసీఐ నిలవాలని, ప్రతి సభ్యుడు సేవాస్ఫూర్తితో పనిచేసి సంస్థ ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. మానవ హక్కుల పరిరక్షణ అనేది ఒక్క సంస్థ బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి పౌరుడు భాగస్వామిగా మారినప్పుడే న్యాయం, సమానత్వం, మానవతా విలువలు బలపడతాయని వక్తలు పిలుపునిచ్చారు. ప్రజల కోసం, బాధితుల కోసం, న్యాయం కోసం హెచ్ఆర్సీసీఐ చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో జిల్లా కమిటీ సభ్యులు చిలకబత్తిన కనకయ్య, సయ్యద్ షారుక్ ఇమ్రాన్, కొప్పుల రామకృష్ణ, వరప్రసాద్, గుర్రం మనోజ్, నవీన్, నాగేశ్వరరావు విశేషంగా కృషి చేశారు. అలాగే బొమ్మల శంకర్, అవినాష్, సుధాకర్ తదితర నిర్వాహకులు, సభ్యులు, సామాజిక కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొని కార్యక్రమానికి విజయవంతం చేశారు.

---

## మోత్కూలగూడలో భక్తిశ్రద్ధలతో ఘనంగా మైసమ్మ, పోచమ్మ తల్లి బోనాలు

- **తెలంగాణ సంప్రదాయానికి ప్రతీకగా మోత్కూలగూడలో బోనాల మహోత్సవం**
- **సర్పంచ్ జెట్ట లావణ్య రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా మైసమ్మ, పోచమ్మ బోనాలు**

**షాద్ నగర్,ఆగస్టు 4 (పీసీడబ్ల్యూ న్యూస్) :**షాద్‌నగర్ నియోజకవర్గంలోని నందిగామ మండలం మోత్కూలగూడ గ్రామంలో మైసమ్మ, పోచమ్మ తల్లి బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ జెట్ట లావణ్య రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పోతురాజుల సయ్యాట, డప్పు వాయిద్యాలు, జానపద కళారూపాలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తుల జైజై ధ్వానాలతో గ్రామం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా సర్పంచ్ జెట్ట లావణ్య రమేష్ మాట్లాడుతూ బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. అమ్మవారి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఇటువంటి ఆధ్యాత్మిక వేడుకలు సమాజంలో ఐక్యత, సామరస్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ వానరసి నరసింహ, మాజీ సర్పంచ్ ఎల్లమ్మ నరసింహులు, వార్డు సభ్యులు, పార్టీలకు అతీతంగా గ్రామ యువకులు, గ్రామ పెద్దలు, యువత, మహిళలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని బోనాల సంబరాలను ఘనంగా నిర్వహించారు.

## ఆగస్టు 6 విద్యార్థుల మహా ధర్నాను విజయవంతం చేయాలి: ఎస్ఎఫ్ఐ

- **విద్యార్థుల సమస్యల పరిష్కారానికి 'ఛలో హైదరాబాద్'**
- **విద్యా హక్కుల సాధనకు విద్యార్థులు ఐక్యం కావాలి: వడ్ల శ్రీకాంత్**




**షాద్ నగర్,ఆగస్టు 4 (పీసీడబ్ల్యూ న్యూస్) :**విద్యార్థుల సమస్యల పరిష్కారం, విద్యా హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ విద్య బలోపేతమే లక్ష్యంగా ఆగస్టు 6న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ (ధర్నా చౌక్) వద్ద నిర్వహించనున్న 'ఛలో హైదరాబాద్' విద్యార్థుల మహా ధర్నాను విద్యార్థులంతా విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ షాద్‌నగర్ డివిజన్ కార్యదర్శి వడ్ల శ్రీకాంత్ పిలుపునిచ్చారు. మంగళవారం షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, విజ్ఞాన్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అవగాహన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడమే ఈ మహా ధర్నా ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడం, విద్యా హక్కులను పరిరక్షించడం, కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం, ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయడం వంటి డిమాండ్ల సాధన కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల హక్కుల కోసం జరుగుతున్న ఈ పోరాటంలో ప్రతి విద్యార్థి బాధ్యతగా పాల్గొని మహా ధర్నాను విజయవంతం చేయాలని శ్రీకాంత్ కోరారు. షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు పరిసర ప్రాంతాల డిగ్రీ, జూనియర్ కళాశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ అవగాహన సమావేశంలో ఎస్ఎఫ్ఐ టౌన్ ఉపాధ్యక్షులు అదిల్, చరణ్, నాయకులు శివ, రాంచరణ్, తరుణ్, రాజేష్, శ్రీనేతన్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ భవన నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించడం అభినందనీయం

**పంచాయతీరాజ్ డిఇ శ్రీనివాస్**

**భవన నిర్మాణ పనులను పరిశీలించిన అధికారులు**

**సర్పంచ్ చందు నాయక్‌ను అభినందించిన అధికారులు**



**షాద్ నగర్,ఆగస్టు 4 (పీసీడబ్ల్యూ న్యూస్) :** గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులు సర్పంచ్ చందు నాయక్ నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ చేపట్టడం అభినందనీయమని షాద్ నగర్ పంచాయతీరాజ్ డిఇ శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం ఫరూక్ నగర్ మండలం ఉప్పరిగడ్డ గ్రామపంచాయతీ లో నూతనంగా నిర్మిస్తున్న గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులను డి ఈ శ్రీనివాస్, ఏఈ గోపాల్ లు పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఉప్పరిగడ్డ గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనుల్లో సర్పంచ్ చందు నాయక్ నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ పనులు చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. స్టీల్, సిమెంటు, ఇసుక వంటి వస్తువులను ఉపయోగించి భవన నిర్మాణ పనులను చేపట్టడం, నాణ్యత ప్రమాణాలకు పెద్దపీట వేయడం అభినందనీయమని సూచించారు. పంచాయతీ భవన నిర్మాణానికి ప్రభుత్వం 20 లక్షల రూపాయలు మంజూరు చేసిందని, ఈ నిధులకు అనుగుణంగా పనులు చేస్తున్నారని తెలిపారు. అదేవిధంగా గ్రామపంచాయతీలో నూతనంగా చేపట్టిన అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులను సైతం అధికారులు పరిశీలించారు. సర్పంచ్ చందు నాయక్ చేపట్టిన అభివృద్ధి పనులను చూసి అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. అయ్యవారిపల్లి గ్రామం నుండి జయరాం తండా వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మించేందుకుగాను చేపట్టనున్న పనులను పరిశీలించారు. బీటీ రోడ్డు నిర్మాణంలో చేపట్టనున్న కల్వర్టులు, వ్యవసాయ పొలాల రైతులతో అధికారులు నేరుగా చర్చించారు. పట్టా భూములు, రోడ్డు నిర్మాణ పనుల్లో ఏమైనా సమస్యలు వస్తున్నాయా అనే విషయాలను సైతం రైతులను అడిగి తెలుసుకున్నారు. షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతోనే ఉప్పరిగడ్డ గ్రామపంచాయతీ అభివృద్ధి జరుగుతుందని సర్పంచ్ చందు నాయక్ తెలిపారు. మున్ముందు పంచాయతీ అభివృద్ధిని మరింత చేసేందుకు తాను శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని సర్పంచ్ చందు నాయక్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపరిగడ్డ ఉపసర్పంచ్ శ్రీలత తిరుపతయ్య తోపాటు వార్డు సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## లింగారెడ్డిగూడలో ఘనంగా వనమహోత్సవం

**గ్రామస్తులకు పండ్ల మొక్కల పంపిణీ**

**పాఠశాల ఆవరణలో మొక్కల నాటకం.. వనమహోత్సవాన్ని విజయవంతం చేసిన గ్రామస్తులు**



**షాద్ నగర్,ఆగస్టు 4 (పీసీడబ్ల్యూ న్యూస్) :** ఫరూఖ్‌నగర్ మండలం లింగారెడ్డిగూడ గ్రామంలో మంగళవారం వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులకు వివిధ రకాల పండ్ల మొక్కలను పంపిణీ చేయడంతో పాటు స్థానిక పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ ఎంసి ప్రవీణ్ కుమార్, ఉప సర్పంచ్ ఎర్రోళ్ల అశోక్ హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించడం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించి భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో గ్రామ కార్యదర్శి రాము, వార్డు సభ్యులు గోదా లక్ష్మయ్య యాదవ్, మెహరాజ్, శశాంక్ గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకరయ్య పాల్గొన్నారు. అలాగే గ్రామస్తులు గోదా రమేష్ యాదవ్, దాదేమియా, మంగలి మల్లేష్, కాల్ అప్ప, లక్ష్మారెడ్డి, బస్తాపురం అంజయ్య, శివకుమార్, సంగ్రామ్, మహేందర్ తదితరులు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు సహకారం అందించారు.

## రవీందర్ రెడ్డికి ప్రభుత్వ విప్ రాంచందర్ నాయక్ పరామర్శ

**రోడ్డు ప్రమాదంలో గాయపడిన కాంగ్రెస్ నాయకుడి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని**

**త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష**

**నర్సింహులపేట ఆగస్టు 4 (పీసీడబ్ల్యూ న్యూస్) :** డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచందర్ నాయక్ నర్సింహులపేట మండల కాంగ్రెస్ నాయకుడు రవీందర్ రెడ్డిని మంగళవారం తొర్రూరులోని టీచర్స్ కాలనీలోని ఆయన నివాసంలో పరామర్శించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చేయి విరగడంతో చికిత్స పొందుతున్న రవీందర్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రాంచందర్ నాయక్ మాట్లాడుతూ వైద్యుల సూచనలు పాటిస్తూ పూర్తి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. త్వరగా కోలుకుని తిరిగి ప్రజాసేవలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీ తరఫున ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నర్సింహులపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జినుకల రమేష్, జిల్లా కార్యదర్శులు సోమిరెడ్డి, కొమ్మినేని సతీష్, తొర్రూరు వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ బట్టు నాయక్, దంతాలపల్లి సర్పంచ్ బాలాజీ, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ జైపాల్ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు చల్ల మధుకర్ రెడ్డి, దంతాలపల్లి మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మురళి, డోర్నకల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు హరికృష్ణ, పడమటి గూడెం ఉప సర్పంచ్ నవీన్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు గురుపాల్ రెడ్డి, లింగారెడ్డి, సోమిరెడ్డి, మండల నాయకులు చంద్రమోహన్, హరిలాల్, వాసు, దైద వెంకన్నతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## శంకర్ కుమార్తె అదితి కొత్త చిత్రం 'వన్స్ మోర్'...

ప్రముఖ దర్శకుడు శంకర్ కుమార్తెగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి, నటిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న అదితి శంకర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న కొత్త చిత్రం 'వన్స్ మోర్'. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఈ రొమాంటిక్ డ్రామా విడుదల తేదీని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. అర్జున్ దాస్ హీరోగా నటిస్తున్న ఈ సినిమాను ఆగస్టు 28న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురానున్నట్టు వెల్లడించింది.విఘ్నేశ్ శ్రీకాంత్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా విడుదల తేదీ ప్రకటనతో అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. ప్రముఖ నిర్మాణ సంస్థ మిలియన్ డాలర్ స్టూడియోస్ తమ సోషల్ మీడియా ద్వారా ఈ విషయాన్ని పంచుకుంది. "పండగ రోజు ఇదే. నిరీక్షణకు తెరపడి ప్రేమ మొదలయ్యే చోటు. మా ప్రేమ క్యాలెండర్‌లో ఇష్టమైన తేదీ దొరికింది. 'వన్స్ మోర్' ఆగస్టు 28న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతోంది" అని పోస్ట్ చేసింది.ఈ సినిమాకు పలు ఆకర్షణలు ఉన్నాయి. ముఖ్యంగా, మలయాళంలో 'హృదయం', తెలుగులో 'హాయ్ నాన్న' వంటి చిత్రాలతో చార్ట్‌బస్టర్ ఆల్బమ్స్ అందించి సంచలనం సృష్టించిన ప్రముఖ సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్, ఈ సినిమాతో తమిళ చిత్ర పరిశ్రమకు పరిచయం అవుతున్నారు. ఇప్పటికే విడుదలైన కొన్ని పాటలు సంగీత ప్రియులను ఆకట్టుకుంటున్నాయి.అర్జున్ దాస్, అదితి శంకర్ జంటగా నటిస్తున్న ఈ చిత్రంలో మోడల్, నటి సోనా ఒలికల్ ఒక కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాకు అరవింద్ విశ్వనాథన్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, నాష్ ఎడిటింగ్ బాధ్యతలు చేపట్టారు. రాజ్ కమల్ ఆర్ట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. మిలియన్ డాలర్ స్టూడియోస్ పతాకంపై యువరాజ్ గణేశన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. హరీశ్ దురైరాజ్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా, విజయ్ ఎంపీ క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు.

### అప్పుడు క్లాప్ అసిస్టెంట్.. ఇప్పుడు అదే హీరోకి ప్రొడ్యూసర్..

## నానిది అసలైన విజయం!



సినీ పరిశ్రమలో ఎవరి జాతకం ఎప్పుడు ఎలా మారుతుందో చెప్పలేం. ఒకప్పుడు క్లాప్ అసిస్టెంట్‌గా పనిచేసిన వ్యక్తి, రెండు దశాబ్దాల తర్వాత అదే హీరోతో సినిమా నిర్మించే స్థాయికి ఎదగడం నిజంగా ఓ అద్భుతం. అలాంటి స్ఫూర్తిదాయక ప్రయాణమే నేచురల్ స్టార్ నానిది. హీరో నితిన్ కథానాయకుడిగా, నాని సమర్పణలో 'అలియాస్ రుక్మిణీ' అనే కొత్త చిత్రం నిన్న హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని యూనానిమస్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు.ఈ సందర్భంగా ఓ ఆసక్తికరమైన విషయం వెలుగులోకి వచ్చింది. సుమారు 21 ఏళ్ల క్రితం, 2005లో కె. రాఘవేంద్రరావు దర్శకత్వంలో నితిన్ హీరోగా నటించిన 'అల్లరి బుల్లోడు' సినిమాకు నాని క్లాప్ అసిస్టెంట్‌గా పనిచేశారు. అప్పట్లో నితిన్‌పై చిత్రీకరించిన సన్నివేశాలకు క్లాప్ కొట్టిన నాని, ఇప్పుడు అదే నితిన్ సినిమాకు నిర్మాతగా మారి ముహూర్తపు షాట్‌కు క్లాప్ కొట్టడం విశేషం. ఈ రెండు సందర్భాలకు సంబంధించిన ఫొటోలను పోలుస్తూ.. 'ఇదే కదా అసలైన సక్సెస్' అంటూ అభిమానులు సోషల్ మీడియాలో ప్రశంసలు కురిపిస్తున్నారు.దర్శకుడు కావాలనే లక్ష్యంతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన నాని, లెజెండరీ డైరెక్టర్ బాపు వద్ద 'రాధా గోపాళం' సినిమాకు, ఆ తర్వాత రాఘవేంద్రరావు వద్ద డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేశారు. ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా స్వయంకృషితో పైకొచ్చారు. అనుకోకుండా 'అష్టా చమ్మా' చిత్రంతో హీరోగా మారి, ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. విభిన్నమైన కథలను ఎంచుకుంటూ, సినిమా సినిమాకు తన నటనను మెరుగుపరుచుకుంటూ ప్రేక్షకుల హృదయాల్లో పక్కింటి కుర్రాడిగా స్థానం సంపాదించారు.ఒకప్పుడు మినిమమ్ గ్యారెంటీ హీరోగా పేరు తెచ్చుకున్న నాని, ఇప్పుడు రూ.100 కోట్ల మార్కెట్ ఉన్న స్టార్‌గా ఎదిగారు. హీరోగానే కాకుండా నిర్మాతగానూ అభిరుచి గల చిత్రాలను నిర్మిస్తున్నారు. ఒకప్పుడు క్లాప్ అసిస్టెంట్‌గా ఉన్న స్థాయి నుంచి, అదే హీరోతో సినిమా నిర్మించే స్థాయికి ఎదగడం ఆయన పట్టుదలకు, కష్టానికి నిదర్శనం. త్వరలో ఆయన మెగాస్టార్ చిరంజీవితోనూ ఓ సినిమా చేయనుండటం ఆయన కెరీర్‌లో మరో మైలురాయిగా నిలవనుంది.



## నా పర్సనల్ లైఫ్ గురించి మీకేం తెలుసు?

### : పుకార్లపై అనుపమ పరమేశ్వరన్ ఘాటు స్పందన

యంగ్ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ ఇటీవల సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్న సందేశాలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. తమిళ నటుడు ధృవ్ విక్రమ్‌తో ప్రేమాయణం ముగిసిందని, ఆ బ్రేకప్ బాధలోనే ఆవేదనతో కూడిన పోస్టులు పెడుతోందంటూ నెట్టింట పుకార్లు వైరల్ అయ్యాయి. ఈ వార్తలపై తాజాగా ఒక ఇంటర్వ్యూలో స్పందించిన అనుపమ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. "నా అధికారిక సోషల్ మీడియా ఖాతాలో ఏం పోస్ట్ చేయాలనేది పూర్తిగా నా వ్యక్తిగత హక్కు, నా సొంత నిర్ణయం. నా బాధను ఇతరుల ముందు ప్రదర్శించి సానుభూతి పొందాల్సిన అవసరం నాకు లేదు. ఒక సాధారణ మహిళగా జీవితంలో ఎదుర్కొనే మార్పుల గురించే నేను మాట్లాడాను. ఆ మార్పులను సమాజంతో ధైర్యంగా పంచుకోవడం నాకు గర్వంగా అనిపిస్తోంది. నా జీవితం, నా పర్సనల్ లైఫ్ గురించి బయట ఉన్న మీకేం తెలుసు? ఇది నా ఇన్‌స్టాగ్రామ్, నాకు నచ్చినవి నేను పోస్ట్ చేసుకుంటాను. నన్ను ప్రశ్నించడానికి మీరెవరు?" అంటూ ఆమె ఘాటుగా సమాధానమిచ్చింది.మరోవైపు రొటీన్ కథలకు భిన్నమైన ప్రాజెక్టులను ఎంచుకుంటున్న అనుపమ, ప్రస్తుతం 'క్రేజీ కల్యాణం' అనే చిత్రంలో నటిస్తోంది. దర్శకుడు బద్రప్ప సారథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో తరుణ్ భాస్కర్, నరేశ్, అఖిల్ ఉడ్డెమారి కీలక పాత్రలు పోషిస్తున్నారు. పర్సనల్ లైఫ్‌పై వచ్చిన వదంతులకు సూటిగా చెక్ పెట్టిన అనుపమ వ్యాఖ్యలు ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి.

## విశ్రాంతి తీసుకుంటున్న తారక్..

### నాన్ స్టాప్ గా జరుగుతున్న 'డ్రాగన్' షూటింగ్



టాలీవుడ్ అగ్ర కథానాయకుడు జూనియర్ ఎన్టీఆర్ భుజానికి గాయమైన సంగతి తెలిసిందే. వైద్యుల సలహా మేరకు ప్రస్తుతం ఆయన విశ్రాంతి తీసుకుంటున్నారు. డాక్టర్ల పర్యవేక్షణలో మెరుగైన చికిత్స అందుతుండగా, మరో రెండు వారాల పాటు ఆయన షూటింగ్‌కు దూరంగానే ఉండే అవకాశం ఉందని సినీ వర్గాలు వెల్లడించాయి.హీరో అందుబాటులో లేనప్పటికీ ఆయన నటిస్తున్న 'డ్రాగన్' చిత్ర బృందం పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా ముందడుగు వేస్తోంది. సమయం వృథా కాకుండా నాన్-స్టాప్ షూటింగ్ కొనసాగిస్తోంది. ప్రస్తుతం ఎన్టీఆర్ లేని సన్నివేశాలను దర్శకుడు ప్రశాంత్ నీల్ చిత్రీకరిస్తున్నట్లు ఇండస్ట్రీ టాక్. ఆయన పూర్తి కోలుకుని సెట్స్‌లో అడుగుపెట్టిన వెంటనే ఆయనకు సంబంధించిన కీలక ఘట్టాలను చిత్రీకరించేలా ప్లాన్ చేస్తున్నారు.కాగా, ఈమధ్య కాలంలో టాలీవుడ్‌లో వరుసగా నటీనటులు గాయపడటం అభిమానులను కలవరపెడుతోంది. ఇటీవల సీనియర్ బాలకృష్ణ, రష్మిక మందన్న, రామ్ చరణ్ కూడా గాయపడిన సంగతి తెలిసిందే.

## జ్యోతిక నాపై నమ్మకం ఉంచింది..

### అందుకే ఆ సాహసం చేశా: సూర్య



స్టార్ హీరో సూర్య తన 'కరుప్పు' సినిమా విడుదల సమయంలో ఎదుర్కొన్న తీవ్ర ఆర్థిక కష్టాల గురించి తాజాగా వెల్లడించారు. సినిమా విడుదలకు చివరి నిమిషంలో అదనపు రుణాలు తీసుకోవాల్సి వచ్చిందని, ఆ క్లిష్ట సమయంలో తన భార్య జ్యోతిక అండగా నిలబడిందని ఆయన తెలిపారు.

ఆర్‌జే బాలాజీ దర్శకత్వంలో త్రిషతో కలిసి సూర్య నటించిన 'కరుప్పు' చిత్రం 2026 మే 14న విడుదల కావాల్సి ఉండగా, కొన్ని ఆర్థిక సమస్యల కారణంగా ఒకరోజు ఆలస్యమైంది. తమిళనాడులో పంపిణీకి సంబంధించిన లావాదేవీలు కొలిక్కి రాకపోవడంతో ఆ రోజు ఉదయం షోలు రద్దయ్యాయి. దీంతో సూర్య స్వయంగా రంగంలోకి దిగి, వ్యక్తిగతంగా భారీ మొత్తం చెల్లించడంతో పాటు అదనపు నిధులు సమకూర్చి మే 15న సినిమాను విడుదల చేశారు. అనేక అడ్డంకులను దాటుకుని విడుదలైన ఈ చిత్రం, బాక్సాఫీస్ వద్ద రూ.300 కోట్లకు పైగా వసూళ్లు సాధించి సంచలన విజయం నమోదు చేసింది.

ఈ నేపథ్యంలో 'ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సూర్య ఆనాటి పరిస్థితులను గుర్తుచేసుకున్నారు. "ఈ విషయంలో జ్యోతికకు థ్యాంక్స్ చెప్పాలి. అది చాలా పెద్ద ఆర్థిక భారం. చివరి నిమిషంలో నా మీద పడింది. నేను అదనపు రుణాలు తీసుకుంటున్నప్పుడు ఆమె నాపై నమ్మకం ఉంచింది. ఒకవేళ ఏదైనా తేడా వస్తే, కుటుంబంగా మేమంతా కష్టాలు పడాల్సి వచ్చేది. అయినా ఆమె నా నిర్ణయాన్ని నమ్మింది" అని సూర్య వివరించారు.అయితే, జ్యోతిక మాత్రం ఈ ప్రశంసను స్వీకరించలేదు. "ఈ క్రెడిట్ నేను తీసుకోను. ఇదంతా పూర్తిగా ఆయన కృషే. సినిమాను విజయవంతం చేయాలనే ఆయన ఔదార్యం వల్లే ఇది సాధ్యమైంది" అని ఆమె బదులిచ్చారు. ఈ విజయం వెనుక దర్శకుడు ఆర్‌జే బాలాజీ, ఇతర ఫైనాన్షియర్ల కృషి కూడా ఉందని సూర్య పేర్కొన్నారు.

## ఫ్యామిలీ మెలోడీతో వచ్చిన రవితేజ..

### 'ఇరుముడి' నుంచి కొత్త పాట

మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న కొత్త చిత్రం 'ఇరుముడి' నుంచి మేకర్స్ రెండో పాటను విడుదల చేశారు. 'యాలాలలో యాలాలలో' అంటూ సాగే ఈ మెలోడీ సింగిల్‌ను తాజాగా విడుదల చేశారు. కుటుంబ భావోద్వేగాలతో కూడిన ఈ పాట శ్రోతలను ఆకట్టుకుంటోంది.

ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తుండగా, ఈ పాటకు అనంత శ్రీరామ్ సాహిత్యం సమకూర్చారు. ప్రముఖ గాయకులు హేశం అబ్దుల్ వహాబ్, సాధిక కలిసి ఆలపించారు. తెలుగుతో పాటు తమిళంలో కూడా 'మనసు తన్నాలా' పేరుతో ఈ పాటను ఏకకాలంలో విడుదల చేశారు.

'ఇరుముడి' చిత్రంలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. శివ నిర్వాణ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోంది. సాయి కుమార్, బేబీ నక్షత్ర, అజయ్ ఘోష్ కీలక పాత్రలలో కనిపించనున్నారు. ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసిన చిత్రబృందం, ఆగస్ట్ 21న ఈ సినిమాను థియేటర్లలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తోంది.

